

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ
తెలుగు దినపత్రిక


## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం
సంప్రదించవలసిన నెం : 9397303326


రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 430 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | శుక్రవారం 18 జూలై 2025 | వెల : 4/-




- హైకోర్టు ఆదేశాలతో సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు పూర్తి చేయాలని లక్ష్యం
- బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదం కోసం ఎదురు
- ఎంపీటీసీ, జెడ్పీటీసీకి సంబంధించి ఐదు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం యోచిస్తున్నట్లు సమాచారం.
- మరి గ్రామీణ రాజకీయాల్లో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయో వేచి చూడాల్సిందే.
- జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల ఖరారుతో ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతోంది.

# ఏ క్షణమైనా నోటిఫికేషన్?

**హైదరాబాద్**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల ఖరారుతో ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు సిద్ధమవు తోంది. హైకోర్టు ఆదేశాలతో సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు పూర్తి చేయా లని లక్ష్యంగా పెట్టుకున్నారు. బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీకి సంబంధించి ఐదు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం యోచిస్తున్నట్లు సమాచారం. మరి గ్రామీణ రాజకీయాల్లో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయో వేచి చూడాల్సిందే..స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా.. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసింది. మొత్తం 566 ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు, అలాగే రాష్ట్రవ్యాప్తంగా 5,773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఏ క్షణంలోనైనా జరగవచ్చనే సంకేతాలను వెలువడుతున్నాయి. ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలని తెలంగాణ ప్రభుత్వం పంచాయితీ రాజ్ శాఖను ఆదేశించింది. ఎన్నికలకు అవసరమయ్యే సామాగ్రిని సిద్ధం చేసుకోవాలని కూడా నిర్దేశించింది. సెప్టెంబర్ 30వ తేదీలోగా తెలంగాణలో స్థానిక ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఇటీవల హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ఏర్పాట్లను వేగవంతం చేసింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు - మిగతా3లో

## ఎన్నికల 'పవర్ ప్లే'.. ఉచితం అంటూ బీహారీలకు నితీశ్ బంపరాఫర్!



- ఓటర్లను ఆకర్షించేందుకు ప్రభుత్వం, ప్రతిపక్షం.. ప్రజలకు వరాలు
- బీహార్‌లో 125 యూనిట్ల లోపు కరెంటు బిల్లులు వస్తే డబ్బులు చెల్లించాల్సి అవసరం లేదని ఆఫర్
- వచ్చే నెల నుంచే ఇది అమలులోకి



## రేవంత్.. రాజీనామా చేయి

- కాంట్రాక్టర్లను పెంచి పోషించడానికే బనకచర్ల ప్రాజెక్టును ముందుకు తీసుకొచ్చారు
- తెలంగాణలో అచేతన సీఎంగా ఉన్న రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తే రాష్ట్రానికి మంచి
- బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదు
- కాంట్రాక్టర్లు, కమిషన్ల కోసమే దీన్ని కడుతున్నారు.

## బంగ్లాదేశ్‌లో పాక్ తాలిబన్ల నియామకాలు!

- ఉగ్రవాదులకు పాల్పడుతున్న తెహ్రీకే ఈ తాలిబన్ పాకిస్థాన్ ఇప్పుడు తన కార్యకలాపాలను బంగ్లాదేశ్‌కు విస్తరించింది
- భారత్‌కు ఇబ్బందికరంగా మారే అవకాశం

# రైలు మార్గాలకు అనుమతి ఇవ్వండి

- సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు త్వరగా అనుమతి ఇవ్వండి
- కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
- హైదరాబాద్ ఇప్పటికే పరిశోధనా సౌకర్యాలతో, సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులతో ముందంజలో ఉన్నది
- దేశీయ టెక్నాలజీ రంగానికి తెలంగాణ కీలక కేంద్రంగా మారుతుంది



**న్యూఢిల్లీ**

తెలంగాణలో సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు త్వరగా అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ఐటీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. రాష్ట్రంలో అధునాతన సౌకర్యాలు, పరిశోధన కేంద్రాలు ఉన్నందున ఏఎస్ఐపి మైక్రో ఎల్ఈడీ ప్రాజెక్టులకు ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా ముచ్చెర్లలో హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటుకు ఈఎంసీ 2.0 పథకం కింద అనుమతి ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ ఇప్పటికే - మిగతా3లోఓ



## అమర్‌నాథ్ యాత్ర నిలిపివేత

- గత రెండు రోజులుగా నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల కారణం
- యాత్రా మార్గంలో భారీ వర్షాలు కురియనున్నాయని వాతావరణశాఖ హెచ్చరికలు
- కుండపోత వర్షం కారణంగా కొండచరియలు విరిగిపడే అవకాశం



## ప్రభుత్వంలో కలవాలన్న ఆహ్వానం తర్వాత.. ఫడ్నవీస్‌ను కలిసిన ఉద్ధవ్ ఠాక్రే

- శాసన మండలి చైర్‌పర్సన్ రామ్ షిండే గదిలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, ఉద్ధవ్ ఠాక్రే సమావేశం
- అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడి నియామకం, వివాదాస్పద త్రిభాషా విధానం వంటి అంశాలపై చర్చ

# బనకచర్లపై తలోమాట చెప్పడం సరికాదు



- ఎజెండాలోని ఇతర అంశాలపై కేంద్రం నిపుణుల కమిటీని నియమించింది
- గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏపీతో కుమ్మక్కై క్రిష్ణా నీటిని తాకట్టు పెట్టింది
- జల వివాదాలపై ఇరు రాష్ట్రాల సీఎంల మీటింగ్ కేంద్ర తొలి విజయం
- ఏళ్ల తరబడి నెలకొన్న జలవివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నదే కేంద్ర అభిమతం
- కేంద్రానికి ఇరు రాష్ట్రాలు సమానమే
- బీజేపీలో గ్రూపుల్లేవ్...ఉన్నదల్లా మోదీ గ్రూపే
- పార్టీ కోసం కష్టపడే వారందరికీ నిధులిస్తున్నా
- గ్రూపుల పేరుతో రాజకీయాలు చేస్తే టిక్కెట్లు ఇచ్చే ప్రసక్తే లేదు


**హైదరాబాద్**

బనకచర్ల విషయంలో ఇరు రాష్ట్రాలు తలో మాట చెప్పడం ఏ మాత్రం సరికాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరు రాష్ట్రాల మధ్య ఏళ్ల తరబడి నెలకొన్న జల వివాదాలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలనే ఉద్దేశంతోనే కేంద్రం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించిందన్నారు. ఇరు రాష్ట్రాలు వేర్వేరు ఎజెండాలతో సమావేశానికి హాజరయ్యాయని, అయిన ప్పటికీ ఆయా ఎజెండాలలోని అంశాలపై నిపుణులు, ఉన్నతాధికారులతో ఎక్స్ పర్ట్ కమిటీని నియమించిందన్నారు. కేంద్రం సాధించిన తొలి విజయ మిది అని పేర్కొన్నారు. ఈరోజు హుజూరాబాద్ లో సైకిళ్ల పంపిణీ కార్యక్ర మానికి హాజరైన బండి సంజయ్ స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, - మిగతా3లో



## రెన్యూవబుల్ ఎనర్జీ కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వ సహకారం కావాలి

- సీఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి లేఖ..
- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం కుదుర్చుకున్న పలు కీలకమైన పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి
- తెలంగాణలోని అధిక సౌరవిద్యుదుత్పత్తి సామర్థ్యం గల జోన్‌లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను అభివృద్ధి చేయడం.
- గ్రిడ్ స్టెబిలిటీ, ఎనర్జీ రిలయబిలిటీలను మరింత పెంచేలా అత్యాధునిక బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ను అభివృద్ధి చేయడం



## బెంగళూరు తొక్కిసలాటపై ప్రభుత్వం సంచలన నివేదిక

- ఆర్సీబీ, కోహ్లీపై ఆరోపణలు!
- వేడుకలకు సంబంధించి వారు సమాచారం మాత్రమే ఇచ్చారు
- అంతేగానీ.. వేడుకల గురించి ఫార్మట్ ప్రకారం అనుమతులు కోరుతూ ఎలాంటి అభ్యర్థనలు చేయలేదు
- ఇలాంటి ఈవెంట్‌ల కోసం కనీసం ఏడు రోజుల ముందే అనుమతులు తీసుకోవాలి

# బెంగళూరు తొక్కిసలాటపై ప్రభుత్వం సంచలన నివేదిక



**బెంగళూరు:** ఐపీఎల్-18 సీజన్‌లో రాయల్ బెంగుళూరు ఛాలెంజర్స్ విజయం సాధించి ట్రోఫిని అందుకుంది. అనంతరం, విజయోత్సవాల వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట కారణంగా 11 మంది మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి తాజాగా కాంగ్రెస్ సిద్దరామయ్య ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో కీలక విషయాలను వెల్లడించింది. ఈ నివేదికలో ఆర్సీబీ యాజమాన్యంపై ప్రభుత్వం ఆరోపణలు చేసింది. అలాగే, నివేదికలో విరాట్ కోహ్లీ పేరు కూడా ప్రస్తావించడం సంచలనంగా మారింది. తొక్కిసలాటపై ప్రభుత్వం అందించిన నివేదిక ప్రకారం.. 'ఐపీఎల్-18 సీజన్‌లో ఆర్సీబీ విజయం సాధించింది. దీంతో జూన్ మూడో తేదీన ఆర్సీబీ యాజమాన్యం పోలీసులను సంప్రదించి విజయోత్సవ పరేడ్ గురించి చెప్పారు. వేడుకలకు సంబంధించి వారు సమాచారం మాత్రమే ఇచ్చారు. అంతేగానీ.. వేడుకల గురించి ఫార్మట్ ప్రకారం అనుమతులు కోరుతూ ఎలాంటి అభ్యర్థనలు చేయలేదు. ఇలాంటి ఈవెంట్‌ల కోసం కనీసం ఏడు రోజుల ముందే అనుమతులు తీసుకోవాలి. కానీ, అలాంటిదేమీ లేకుండా.. విజయం అనంతరం పోలీసులను సంప్రదించకుండానే ఆర్సీబీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో విక్టరీ పరేడ్ గురించి పోస్టు పెట్టింది. చిన్నస్వామి స్టేడియంలో జరిగే ఈ వేడుకకు ఉచిత ప్రవేశమని ప్రకటించింది. ఆ తర్వాత.. మరో పోస్టులో విరాట్ కోహ్లీకి సంబంధించిన వీడియోను కూడా పంచుకుంది. అందులో ఆయన ఈ విజయాన్ని బెంగళూరు ప్రజలు, ఆర్సీబీ అభిమానులతో జరుపుకోవాలని ఉందని పేర్కొన్నారు. దీంతో స్టేడియం సామర్థ్యానికి మించి మూడు లక్షల మందికి పైగా హాజరయ్యారు. స్టేడియం చుట్టూ దాదాపు 14 కి.మీ. దూరం వరకు ప్రజలు గుమిగూడారు. దీంతో మార్గమధ్యలో, స్టేడియం వద్ద పెద్ద మొత్తంలో పోలీసు సిబ్బందిని మోహరించాం. నిర్వాహకులకు సరైన ప్రణాళికలు లేకపోవడం, సంబంధిత అధికారులకు ముందస్తు సమాచారం అందించడంలో విఫలం కావడం వల్లే తొక్కిసలాట జరిగింది. స్టేడియం వద్దకు భారీ సంఖ్యలో అభిమానులు తరలి రావడంతో ఎంట్రీ పాస్‌లు కావాలని నిర్వాహకులు ఎక్స్‌లో పోస్టులు పెట్టారు. దీంతో అప్పటికే అక్కడికి చేరుకున్నవారు గందరగోళానికి గురయ్యారు. గేట్లు తెరిచే క్రమంలో తొక్కిసలాట జరిగింది. మరోవైపు 1,2, 21 గేట్ నంబర్ల వద్ద ప్రజలు బలవంతంగా లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించగా.. పోలీసులు వారిని అడ్డుకొని ఉద్రిక్తతలను తగ్గించారు. ఈ క్రమంలో వేడుకను రద్దు చేయాల్సి ఉన్నా, కార్యక్రమాన్ని మాత్రమే కుదించారు అని పేర్కొంది. అయితే, ఈ ఘటనకు సంబంధించి తమ నివేదికను రహస్యంగా ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును అభ్యర్థించింది. అయితే, దాన్ని తిరస్కరించిన న్యాయస్థానం అలాంటి గోప్యతకు చట్టపరమైన కారణాలు లేవని పేర్కొంది.

# బంగ్లాదేశ్‌లో పాక్ తాలిబన్ల నియామకాలు!



**ఇంటర్నెట్‌డెస్క్:** పాకిస్థాన్‌లో ఉగ్రదాడులకు పాల్పడుతున్న తెహ్రీకే ఈ తాలిబన్ పాకిస్థాన్ ఇప్పుడు తన కార్యకలాపాలను బంగ్లాదేశ్‌కు విస్తరించింది. ఈ విషయం భారత్‌కు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. మరోవైపు ఢాకా పాలకులు మాత్రం ఈ విషయాన్ని ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ఇటీవల కాలంలో ఇద్దరు బంగ్లాదేశీలు పాక్ మీదుగా అఫ్గానిస్థాన్‌కు చేరుకొన్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. వీరిలో ఒకరు వజీరిస్థాన్‌లో పాక్ సైన్యంతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. మరోవైపు అదే సమయంలో మిలిటెంట్ నెట్‌వర్క్‌లతో సంబంధాలున్న 36 మంది బంగ్లాదేశీయులను మలేసియాలో అరెస్టు చేశారు. హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత స్థానిక జిహాదీ గ్రూపులు బలపడుతున్న వేళ.. టీటీపీ ఇక్కడ చేరింది. జులైలో.. బంగ్లాదేశ్ యాంటీ టెర్రరిజమ్ స్క్వాడ్ షమిన్ మహఫుజ్, ఎండీ ఫైసల్ అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసింది. వీరికి టీటీపీతో సంబంధాలున్నాయని డెయిలీ స్టార్ పత్రిక పేర్కొంది. ఇప్పటి వరకు కనీసం 8 మంది బంగ్లాదేశ్ వాసులు టీటీపీలో చురుగ్గా ఉన్నట్లు ఆ దేశ ఇంటెలిజెన్స్ గణాంకాలు చెబుతున్నాయి. గతంలో కూడా బంగ్లాదేశ్ వాసులు విదేశీ ఉగ్రసంస్థలతో సంబంధాలు పెట్టుకొన్నారు. 2016లో ఢాకాలో జరిగిన పేలుడులో 22 మంది చనిపోయారు.

### అతడి చరిత్ర మొత్తం నేరమయం

జులై 14వ తేదీన బంగ్లా యాంటీ టెర్రర్ యూనిట్ షమాని మహఫుజ్‌ను నారాయణ్ గంజ్‌లో అరెస్టు చేసింది. అతడికి టీటీపీతో సంబంధాలు ఉన్నట్లుపేర్కొంది. గతంలో అతడు జమాత్‌ఉల్ ముజాహిద్దీన్ బంగ్లాదేశ్‌లో వ్యవస్థాపకుడు. ఆ తర్వాత జమాత్ ఉల్ అన్సారీ ఫిల్ హిందల్ షరాకియా అనే సంస్థను స్థాపించాడు. 2014లో ఉగ్ర నియమాకాలు చేపట్టినందుకు, 2023లో పేలుడు పదార్థాలు ఉన్నందుకు అతడిని అరెస్టు చేశారు. అతడిని 2024 అక్టోబర్‌లో బెయిల్‌పై విడుదల చేశారు. అతడికి కుకీ-చాన్ నేషనల్ ఫ్రంట్ నేత నాథన్ బోమ్‌తో సంబంధాలున్నాయి. దీనికి చిట్టగాంగ్ హిల్ ప్రాంతంలో ట్రైనింగ్ క్యాంప్‌లు ఉన్నాయి. ఇక తాజాగా అరెస్టు అయిన ఎండీ ఫైసల్ అఫ్గానిస్థాన్‌కు వెళ్లి వచ్చాడు. ఇతడితోపాటు అహ్మద్ జుబైర్ అనే వ్యక్తి ఉన్నా.. అతడు పాక్ ఆర్మీ వజీరిస్థాన్‌లో చేపట్టిన ఆపరేషన్‌లో చనిపోయాడు. వీరిని అఫ్గానిస్థాన్‌లోని ఏరోనాటికల్ ఇంజినీర్ ఇమ్రాన్ హైదర్ టీటీపీలో చేర్చుకొన్నాడు. బంగ్లాదేశ్ నుంచి వచ్చేవారిని జిహాద్‌కు సిద్ధం చేయడంలో అతడిదే కీలక పాత్ర.

# ఎన్నికల 'పవర్ ప్లే'.. ఉచితం అంటూ బీహారీలకు నితీశ్ బంపరాఫర్!



**పాట్నా:** బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల వేళ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రభుత్వం, ప్రతిపక్షం.. ప్రజలకు వరాలను ప్రకటిస్తున్నాయి. బీహార్‌లో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ముఖ్యమంత్రి నితిశ్ కుమార్ భారీ ప్లాన్‌తో హామీలు ఇస్తున్నారు. తాజాగా ప్రజలకు బంపరాఫర్ ఇచ్చారు. బీహార్‌లో 125 యూనిట్ల లోపు కరెంటు బిల్లులు వస్తే డబ్బులు చెల్లించాల్సి అవసరం లేదని ఆఫర్ ప్రకటించారు. వచ్చే నెల నుంచే ఇది అమలులోకి వస్తుందని నితిశ్ చెప్పుకొచ్చారు. సీఎం నితీశ్ కుమార్ తాజాగా ట్విట్టర్ వేదికగా మరో పథకాన్ని ప్రకటించారు. ట్విట్టర్‌లో నితిశ్..'బీహార్ ప్రజల అవసరాల కోసం మేం మరో పథకాన్ని తీసుకువస్తున్నాం. మేం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కరెంట్ చార్జీలు అందుబాటు ధరల్లోనే ఇస్తున్నాం. దీనిపై ఇప్పుడు మరో నిర్ణయం తీసుకున్నాం. గృహ వినియోగదారులు 125 యూనిట్ల వరకు కరెంట్ వాడుకుంటే.. వారు ఎలాంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ పథకం ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. అంటే, జూలై బిల్లులను కూడా కట్టనక్కర్లేదు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని 1.67 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. రానున్న మూడేళ్లలో గృహ వినియోగదారులందరి మద్దతుతో ప్రతి ఇంటిపై సోలార్ పవర్ ప్లాంట్లను అమర్చాలని నిర్ణయించాం. బీహార్‌లో 10వేల మెగావాట్ల సోలార్ ఎనర్జీని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాంకుటీర్ జ్యోతి పథకం కింద.. అత్యంత పేద కుటుంబాలకు సోలార్ ప్లాంట్ల ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. మిగతా వారికి అందుబాటు ధరల్లోనే వీటిని అందజేస్తాం' అని వెల్లడించారు. దీంతో, ఈ పథకంపై బీహార్ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. ఈ పథకం ఎన్నికల్లో ప్రభావం చూపించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. బీహార్ మరికొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అధికారం కోసం అన్ని పార్టీ ప్రజలకు కీలక హామీలు ఇస్తున్నాయి. ఇక, తాము మళ్లీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని నీతీశ్ ఇటీవల హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే.

## ప్రజ్ఞానందా చరిత్ర

**చెన్నై :** అంతర్జాతీయ చెస్ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్‌కు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. భారతీయ యువ గ్రాండ్ మాస్టర్ల చేతిలో వరుసగా ఓటమిపాలవుతూ వస్తున్నాడు. గ్రాండ్ చెస్ టూర్ 2025 జాగ్రెబ్ ఈవెంట్‌లో కార్ల్‌సన్‌ను గుకేశ్ చావు దెబ్బ కొట్టగా.. ఇప్పుడు లాస్ వేగాస్‌లో రమేశ్ బాబు ప్రజ్ఞానందా ఓడించాడు. భారతీయులు కొట్టిన ఈ దెబ్బలకు ఇక మాగ్నస్ కార్ల్‌సన్ ఏకంగా చెస్ నుంచి తప్పుకోవడమే మిగిలుందని కామెంటేటర్లు అనడం విశేషం.లాస్ వేగాస్ వేదికగా జరిగిన ఫ్రీ స్టయిల్ చెస్ గ్రాండ్ స్లామ్ టూర్‌లో ప్రపంచ నెంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్‌ను భారత గ్రాండ్ మాస్టర్ రమేశ్ బాబు ప్రజ్ఞానంద ఓడించాడు. 19 ఏళ్ల ప్రజ్ఞానందా ఐదు సార్లు ఛాంపియన్ అయిన కార్ల్‌సన్‌ను కేవలం 39 ఎత్తుల్లోనే ఓడించాడు. నార్వేకు చెందిన గ్రాండ్‌మాస్టర్ కార్ల్‌సన్ ఇటీవల భారత ప్రస్తుత ఛాంపియన్ డి.గుకేశ్ చేతుల్లో వరుస పరాభవాలను చవి చూశాడు.ఈ ఏడాది ఇప్పటికే మూడు టోర్నమెంట్లు గెలుచుకున్న ప్రజ్ఞానంద ఇప్పుడు కార్ల్‌సన్‌ను క్లాసికల్, రాపిడ్, బ్లిట్స్ మూడు ఫార్మాట్లలోనూ ఓడించాడు. కార్ల్‌సన్‌ను ఇలా మూడు ఫార్మాట్లలోనూ ఓడించిన తొలి భారతీయుడిగా ప్రజ్ఞానంద నిలవడం విశేషం. ఈ ఓటమితో పాటు మరో మ్యాచ్‌లో వెస్లీ సో చేతితోనూ ఓడిన కార్ల్‌సన్ ఈ ఈవెంట్‌ను బయటకు వెళ్లిపోయాడు.వైట్ గ్రూప్‌లో ఉన్న ప్రజ్ఞానంద మొదటగా అబ్దుసత్తొరోవత్‌తో జరిగిన మ్యాచ్‌లో డ్రా, తర్వాత అసౌబాయేవా, కీమర్‌పై వరుస విజయాలు సాధించాడు. చివరగా కార్ల్‌సన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎత్తుగడలు వేస్తూ విజయం సాధించడమే కాకుండా 4.5 పాయింట్లతో గ్రూప్ టాప్‌లో నిలిచాడు.ఫ్రీ స్టయిల్ చెస్ గ్రాండ్ స్లామ్ టూర్‌లో ప్రత్యేకత ఏమిటంటే.. ప్రతి ఆటగాడికి పది నిమిషాల టైమ్ కంట్రోల్ ఉంటుంది. ప్రతి మూవ్‌కు పది సెకన్లు. రెండు గ్రూపులుగా విడిపోయి వైట్ అండ్ బ్లాక్‌లో ప్రతి ఒక్కరూ రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో ఎనిమిది మంది ఆటగాళ్లతో ఆడాల్సి ఉంది. టాప్ 4లో నిలిచిన వారి మధ్య టైటిల్ పోరు సాగుతోంది. గురువారం క్వార్టర్ ఫైనల్స్ జరగనుండగా.. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి రెండు లక్షల అమెరికా డాలర్లను బహుమతిగా అందజేయనున్నారు.

## అమర్‌నాథ్ యాత్ర నిలిపివేత..



**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లో కొనసాగుతున్న అమర్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. యాత్రా మార్గంలో భారీ వర్షాలు కురియనున్నాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో పహల్గామ్, బాల్టాల్ మార్గాలలో కొనసాగుతున్న అమర్‌నాథ్ యాత్రను గురువారం(జూలై 17)న ఒకరోజు నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. కుండపోత వర్షం కారణంగా కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున, ముందు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వివరించారు. శుక్రవారం (జూలై 18)న యాత్ర తిరిగి ప్రారంభమయ్యే ముందు భద్రతా తనిఖీలు నిర్వహించనున్నారని తెలిపారు. కశ్మీర్ డివిజనల్ కమిషనర్ విజయ్ కుమార్ బిధురి మీడియాతో మాట్లాడుతూ గత రెండు రోజులుగా నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల కారణంగా, ట్రాక్‌లపై మరమ్మతు, నిర్వహణ పనులు చేపట్టాల్సిన అవసరం ఏర్పండిందన్నారు. అందుకే గురువారం నాడు ఈ రెండు బేస్ క్యాంపుల మీదుగా పవిత్ర గుహ వైపు వెళ్లేదారిలో ఎటువంటి రాకపోకలను అనుమతించకూడదని నిర్ణయించామన్నారు. పగటిపూట వాతావరణ పరిస్థితులను అనుసరించి శుక్రవారం యాత్ర తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. గందర్‌బాల్ జిల్లాలోని యాత్ర బాల్తాల్ మార్గంలో కొండచరియలు విరిగిపడి ఒక మహిళ మృతిచెందిన నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు యాత్రను ఒకరోజు నిలిపివేసి మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. అమర్‌నాథ్ యాత్రా మార్గంలోని బాల్తాల్ ప్రాంతంలో అధిక వర్షపాతం కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. వర్షాకాలంలో పర్వత ప్రాంతాలలో ఇటువంటి ప్రమాదాలు పొంచి ఉంటాయని అధికారులు తెలిపారు. జూలై 3న యాత్ర ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు 2.47 లక్షలకు పైగా యాత్రికులు అమర్‌నాథ్ పవిత్ర గుహను సందర్శించుకున్నారు.

## ప్రభుత్వంలో కలవాలన్న ఆహ్వానం తర్వాత.. ఫడ్నవీస్‌ను కలిసిన ఉద్ధవ్ ఠాక్రే



**ముంబై:** మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే గురువారం కలిశారు. కుమారుడు ఆదిత్య ఠాక్రే కూడా ఆయన వెంట ఉన్నారు. ప్రతిపక్షంలో ఉన్న ఉద్ధవ్ ఠాక్రే పాలకపక్షంలోకి మారాలని అసెంబ్లీ వేదికగా సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఆహ్వానించిన ఒక రోజు తర్వాత ఇది జరిగింది. శాసన మండలి చైర్‌పర్సన్ రామ్ షిండే గదిలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, ఉద్ధవ్ ఠాక్రే సమావేశమయ్యారు. సుమారు 20 నిమిషాలపాటు వీరిద్దరూ మాట్లాడుకున్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడి నియామకం, వివాదాస్పద త్రిభాషా విధానం వంటి అంశాలపై చర్చించారు. కాగా, మహారాష్ట్రకు చెందిన వివిధ సంపాదకులు రాసిన వ్యాసాల సంకలనం 'మనకు హిందీ ఎందుకు అవసరం?' అనే పుస్తకాన్ని సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు ఉద్ధవ్ ఠాక్రే అందజేశారు. త్రిభాషా విధాన నిర్ణయాన్ని సమీక్షించే కమిటీకి నేతృత్వం వహిస్తున్న నరేంద్ర జాదవ్‌కు కూడా ఆ కాపీ ఇవ్వాలని ఆయన కోరారు. మరోవైపు ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు, మాజీ మంత్రి ఆదిత్య ఠాక్రే కూడా ఆయన వెంట ఉన్నారు. 1వ తరగతి నుంచి మూడు భాషల విధానాన్ని అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ అనేక మంది జర్నలిస్టులు, సంపాదకులు రాసిన వ్యాసాల సంకలనాన్ని సీఎం ఫడ్నవీస్‌కు అందజేసినట్లు ఆదిత్య ఠాక్రే తెలిపారు.

## షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదం.. 50 మంది మృతి

**ఇంటర్నెట్‌డెస్క్:** ఇరాక్ లోని షాపింగ్‌మాల్‌లో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో 50 మంది ప్రాణాలు కోల్పోయారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆల్‌కుట్ ప్రాంతంలో జరిగిన ఈ ప్రమాదం బారినపడి మృతిచెందిన వారిలో పిల్లలు, చిన్నారులే ఎక్కువగా ఉన్నారని పేర్కొన్నాయి. సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చిన దృశ్యాల్లో మాల్‌లో చాలాభాగం మంటల్లో చిక్కుకుపోయినట్లు కనిపించింది (%మీఘింంఅజవ టఅతీవ ఫ్ ంష్ట్రశీజూజూఅఅస్త్ర ఝశ్రీశ్రీ). ఐదంతస్థుల మాల్‌లో చోటుచేసుకున్న ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. 48 గంటల్లో ప్రాథమిక దర్యాప్తు వివరాలు వెల్లడిస్తామని స్థానిక యంత్రాంగం వెల్లడించింది.

# బనకచర్లపై తలోమాట చెప్పడం సరికాదు

-మొదటిపేజీ తరువాయి

స్థానిక నేతలతో కలిసి మాట్లాడారు. కేంద్రం ఈ విషయంలో పెద్దన్న పాత్ర పోషిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను పూర్తిగా స్వాగతిస్తున్నా.ఏళ్ల తరబడి రెండు రాష్ట్రాల మధ్య జలవివాదాలున్నాయి. దీనిన బూచిగా చూపి కొన్ని రాజకీయ పార్టీలు రాజకీయ లబ్ది పొందాలనిచూస్తున్నాయి. అందుకే ఈ వివాదాల పరిష్కారం కోసం కేంద్రం ఫెసిలిటేటర్ పాత్రను పోషించింది. నిన్న మీటింగ్ తరువాత రెండు రాష్ట్రాల సీఎం, మంత్రులు బనకచర్లపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడం ఆశ్చర్యమేసింది. లోపలఏం జరిగిందో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు స్పష్టం చేయాలి. నిన్న కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది.వాస్తవానికి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వేర్వేరుగా సొంత ఎజెండాతో మీటింగ్ కు వెళ్లారు. కేంద్రానికి ఇరు రాష్ట్రాలూ సమానమే.సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలనే ఉద్దేశంతోనే ఇరు రాష్ట్రాల సీఎంతో మీటింగ్ పెట్టింది. ఇది కేంద్రం సాధించిన విజయం.కేంద్రానికి సొంత ఎజెండా లేదు. ఇరు రాష్ట్రాల మధ్య నెలకొన్న సమస్యలను పరిష్కరించుకోవాలన్నదే కేంద్ర ఉద్దేశం. ఇరు రాష్ట్రాలఎజెండాలను పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం ఏ రాష్ట్రానికి అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతో ఆయా ఎజెండాలలోని అంశాలపైఉన్నతాధికారులు, నిపుణులతో కూడిన కమిటీని నియమించింది. ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు వెంటనే ఆ కమిటీ ముందు హాజరైఆయా అంశాలపై అభ్యంతరాలను వ్యక్తం చేయాలని కోరుతున్నా. కేంద్రం ఇంత మంచి నిర్ణయం తీసుకున్నా కనీసం ఇరు రాష్ట్రాలసీఎంలు కనీసం క్రుతజ&ఝత తెలపకపోవడం వారి విజ&ఝతకే వదిలేస్తున్నా. జల వివాదాలపై బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు విడ్డూరం. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏపీలో నాటి ప్రభుత్వంతో కుమ్మక్కై క్రిష్ణాజలాలను ఏపీకి తాకట్టు పెట్టారు. ఈ ప్రభుత్వం కూడా అదే పంథాలో ఉన్నట్లుంది. అందుకే రెండు పార్టీలు కలిసి బనకచర్లపై లేనిపోనివివాదాలు స్రుష్టిస్తూ రాజకీయ లబ్ది పొందాలనుకుంటున్నాయి. ఈ రెండు పార్టీల పాలనవల్ల తెలంగాణ ప్రజలకుఒనగూరిందేమీలేదు.బీసీల రిజర్వేషన్ల విషయంలో బీజేపీ స్టాండ్ చాలా క్లియర్ గా ఉంది. 42 శాతం రిజర్వేషన్లను పూర్తిగా బీసీలకే అందజేస్తానంటే కేంద్రాన్ని ఒప్పించి బిల్లును ఆమోదించే బాధ్యతను మేం తీసుకుంటాం. అట్లా కాకుండా 42 శాతం రిజర్వేషన్లలో 10



శాతం రిజర్వేషన్లు ముస్లింలకు ఇస్తానంటే ఒప్పుకునే ప్రసక్తే లేదు. బీసీల ముసుగులో తెలంగాణలో ముస్లింలందరికీ నూటికి నూరుశాతం రిజర్వేషన్లు అందించే కుట్ర జరుగుతోంది. రాష్ట్రంలో 51 శాతం బీసీ జనాభా ఉంది. అందులో 32 శాతం మాత్రమే రిజర్వేషన్లు ఇస్తాననడం ఎంత వరకు కరెక్ట్? అందులోనూ మోదీ ప్రభుత్వం ఇప్పటికే 27 శాతం రిజర్వేషన్లను బీసీలకు అమలు చేస్తోంది. ఇక కాంగ్రెస్ బీసీలకు ఒనగూరిస్తోంది ఏమిటి? కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుంది. గతంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తేనే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీ స్థానాల్లో ముస్లింలు పోటీ చేసి బీసీల పొట్ట కొట్టారు. ఇక 10 శాతం రిజర్వేషన్లను ముస్లింలకు అమలు చేస్తే ఇక స్థానిక సంస్థల్లో బీసీలకు తీవ్రమైన అన్యాయం జరగబోతోంది. బీసీ సంఘాలు వీటిని గమనించాలని కోరుతున్నా.కాళేశ్వరం ప్రాజెక్టులో ఇరిగేషన్ అధికారుల అవినీతిని చూస్తే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఏసీబీ దాడుల్లో వందల కోట్లు పట్టుపడుతున్నాయి. కాళేశ్వరంలో అంచనాల పెంచి ఏ విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందో వీళ్లను చూస్తే అర్ధమైతోంది. ఇవిగాకాకుండా డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేస్ సహా కేసీఆర్ కుటుంబంపై ఎన్నో అవినీతి కేసులున్నా... గత 19 నెలలుగా ఒక్కటంటే ఒక్క కేసు విషయంలోనూ కేసీఆర్ కుటుంబాన్ని దోషులుగా తేల్చలేకపోయింది. ఎందుకంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ ఆడుతున్న డ్రామాలకు ఇది నిదర్శనం. రెండు పార్టీలు కుమక్కయ్యాయి. తక్షణమే కాళేశ్వరంసహా బీఆర్ఎస్ అవినీతి స్కాంలపై సీబీఐ విచారణ కోరితే జరిపేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది.ఫోన్ ట్యాపింగ్ విషయంలో ఈనెల 24న విచారణకు రావాలని సిట్ పోలీసుల నుండి సమాచారం వచ్చింది. ఈనెల 24న విచారణకు హాజరవుతా. ఫోన్ ట్యాపింగ్ విషయంలో నాకు తెలిసిన వాస్తవాలన్నీ సిట్ ముందుంచుతా.భారతీయ జనతా పార్టీలో ఏ గ్రూపు లేదు. ఉన్నదల్లా మోదీ గ్రూప్. బీజేపీ గ్రూప్. బీజేపీలో ఈ వర్గం ఆ వర్గమంటూ ఉండదు. జెండా కోసం, పార్టీ కోసం పనిచేయాలి. అంతే తప్ప వ్యక్తి కోసం పనిచేస్తే ప్రోత్సహించే ప్రసక్తే లేదు.

బండి సంజయ్ వర్గమైనా సరే... ఇంకే వర్గమైనా సరే. ఉపేక్షించే ప్రసక్తే లేదు. టిక్కెట్లు ఇచ్చే ప్రసక్తే లేదు. అసలు బీజేపీలో వర్గాల ఊసే లేదు. ఎక్కడా లేనిదే ఇక్కడే ఫలానా వర్గమనే వాదనలు ఎందుకొస్తున్నయ్. ఇక్కడ నా పక్కన కూర్చున్న వాళ్లలో ఇంతకుముందు ఎవరితో ఉన్నారో మీకు తెలుసు? ఇప్పుడు వీళ్లంతా పార్టీలోనే ఉన్నారు కదా? అంతెందుకు ప్రతి గ్రామంలో ఏ వర్గం వాళ్లు వచ్చినా సంబంధం లేకుండా పార్టీ కోసం కష్టపడుతున్న వాళ్లను గుర్తించి వాళ్లకు ఎంపీ లాడ్స్, ఈజీఎస్ నిధులను అందిస్తున్నా. పార్టీ కోసం కష్టపడే వారిని గెలిపించే బాధ్యత మాపై ఉంది. అందుకే తెలంగాణలో అత్యధికంగా 219 కోట్ల రూపాయల సీఆర్ఐఎఫ్ నిధులను కరీంనగర్ పార్లమెంట్ కు తీసుకొచ్చి రోడ్లు వేయిస్తున్నా. ఈసారి మరో రూ.150 కోట్లదాకా సీఆర్ఐఎఫ్ నిధులు తీసుకురాబోతున్నా. అట్లాగే అడిగిన వాళ్లందరికీ బోర్లు వేయిస్తున్నా. అయితే కొందరు కావాలనే గిరిగీసుకుని ఫలానా వర్గమని మాట్లాడితే మాత్రం వాళ్లకు టిక్కెట్లు ఇచ్చే ప్రసక్తే లేదు. అది బండి సంజయ్ వర్గమైనా సరే. ఇకనైనా అట్లాంటి వర్గాలను పక్కనపెట్టి అందరూ కలిసి ఒకేతాటిపైకి రావాలి.మీకు ఇంకో విషయం చెప్పాలే. పార్లమెంట్ ఎన్నికల్లో నేను 2.25 లక్షల మెజారిటీతో గెలిచానంటే దానికి కారణం కార్యకర్తలు పడ్డ కష్టమే. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వాళ్లకు టిక్కెట్లు ఇచ్చి గెలిపించుకునే బాధ్యత నేను తీసుకుంటా. అంతెందుకు జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి ఒకప్పుడు నాకు వ్యతిరేకంగా పనిచేశారు. కానీ విద్యార్థి దశ నుండే ఆయన కమిట్ మెంట్ ఏమిటో నాకు తెలిసి. అందుకే అధ్యక్ష పదవి ఇచ్చినం. దయచేసి ఇట్లాంటి వాటిని మీడియా కూడా ప్రోత్సహించొద్దని కోరుతున్నా.

## రైలు మార్గాలకు అనుమతి ఇవ్వండి



-మొదటిపేజీ తరువాయి

పరిశోధనా సౌకర్యాలతో, సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులతో ముందంజలో ఉన్నదని సీఎం వివరించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ఉద్యోగాలు, పెట్టుబడులు పెరగడంతోపాటు, దేశీయ టెక్నాలజీ రంగానికి తెలంగాణ కీలక కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**కొత్త రైలు మార్గాలు**

రూ.8 వేల కోట్ల విలువైన రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్ట్‌కు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. రీజినల్ రింగ్ రైలుతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానత పెరగడంతో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రధాన స్టేషన్లలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టుతో గ్రామీణ పేదరికం తగ్గడంతో పాటు పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. దీంతోపాటు కాజీపేటలో రైల్వే డివిజన్ ఏర్పాటు చేసి, ప్రయాణికులకు వేగవంతమైన సేవలు అందించాలన్నారు.

**రీజినల్ రింగ్ రైలు, డ్రైపోర్ట్‌అను సంధానం**

రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు గ్రామీణ, పట్టణ ప్రాంతాల అనుసంధానాన్ని పెంచి, హైదరాబాద్‌లో రద్దీ తగ్గిస్తుందని సీఎం తెలిపారు. హైదరాబాద్ డ్రైపోర్ట్ నుంచి బందరు ఓడరేవుకు రైలు మార్గం మంజూరు చేయాలని కోరారు. ఈ మార్గం ఔషధాలు, ఎలక్ట్రానిక్స్, ఆహార ఉత్పత్తుల ఎగుమతులకు ఉపయోగపడుతుందని వివరించారు.

**రైలు మార్గాలకు అనుమతి కోరిన సీఎం**

ఇందులో భాగంగా వికారాబాద్ – కృష్ణా (122 కి.మీ. అంచనా వ్యయం రూ.2,677 కోట్లు), కల్వకుర్తి – మాచర్ల (100 కి.మీ. అంచనా వ్యయం రూ.2 వేల కోట్లు), డోర్నకల్ – గద్వాల (296 కి.మీ. అంచనా వ్యయం రూ.6,512 కోట్లు), డోర్నకల్ – మిర్యాలగూడ (97 కి.మీ. అంచనా వ్యయం రూ.2,184 కోట్లు) మార్గాలను వంద శాతం రైల్వే శాఖ వ్యయంతో మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ మార్గాలు రాష్ట్రంలో అనుసంధానత, పారిశ్రామిక, వ్యవసాయ ఎగుమతులకు ఎంతో దోహదపడతాయని తెలిపారు.

**సమావేశంలో పాల్గొన్న నాయకులు**

సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎంపీలు పోరిక బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, రామ సహాయం రఘురామరెడ్డి, సురేశ్ షెట్కార్ కూడా హాజరయ్యారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి సంజయ్ కుమార్, ఆర్ అండ్ బీ కార్యదర్శి వికాస్ రాజ్, డాక్టర్ గౌరవ్ ఉప్పల్ కూడా ఈ భేటీలో ఉన్నారు.

**మంత్రి సానుకూల స్పందన**

సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణలో సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ పార్క్, రైల్వే ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చే విషయంలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి, ఉపాధి అవకాశాలకు దోహదపడతాయని సీఎం అభిప్రాయపడ్డారు.

## రేవంత్ రాజీనామా చేయి...



**హైదరాబాద్ :** కేవలం కాంట్రాక్టర్లను పెంచి పోషించడానికే బనకచర్ల ప్రాజెక్టును ముందుకు తీసుకొచ్చారని ఆరోపించారు ఎమ్మెల్సీ కవిత. ఢిల్లీలో జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో జరిగిన ఇరు రాష్ట్రాల సీఎంల సమావేశంపై ఆమె స్పందించారు. మీడియా సమావేశం ఏర్పాటు చేసి తెలుగు రాష్ట్రాల సీఎంలపై విరుచుకుపడ్డారు. తెలంగాణలో అచేతన సీఎంగా ఉన్న రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తే రాష్ట్రానికి మంచి జరుగుతుందని కామెంట్ చేశారు. బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు కవిత. కాంట్రాక్టర్లు, కమిషన్ల కోసమే దీన్ని కడుతున్నారని ఆరోపించారు. అంతా కలిసి మెగా సంస్థకు ప్రాజెక్టు కట్టబెట్టే ప్రయత్నాల్లో ఉన్నారని విమర్శించారు. "కాంట్రాక్టర్లు, కమిషన్ల కోసం బనకచర్ల కడుతున్నారు. మెగా కంపెనీ వాటా కోసమే ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లారు. చంద్రబాబు అజెండాలో భాగంగానే సమావేశం సాగింది." అని ఆరోపించారు. కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్ సమక్షంలో జరిగిన తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీపై తీవ్ర విమర్శలు చేశారు. ఆ భేటీ అజెండాలో తొలి అంశమే బనకచర్ల ప్రాజెక్టు ఉందని అన్నారు కవిత. అలా ఉంటే వెళ్లబోమని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన రేవంత్ రెడ్డి సమావేశంలో ఎలా కూర్చున్నారని ప్రశ్నించారు. "బనకచర్లపై చర్చకు తాను వెళ్లనని సీఎం రేవంత్ రెడ్డి మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు. నిన్నటి ఢిల్లీ సమావేశంలో అజెండాలో మొదటి అంశమే బనకచర్ల. ముఖ్యమంత్రి, మంత్రి ఉత్తమ్ సిగ్గులేకుండా గోదావరి జలాలను చంద్రబాబు చేతిలో పెట్టారు." అని ధ్వజమెత్తారు. ఇలాంటి నాన్‌సీరియస్ ముఖ్యమంత్రి తప్పుకోవాలని రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఇంకా టీడీపీ కాలేజీ స్టూడెంట్‌గానే ఉన్నారని అందుకే ఆ పార్టీకి అనుకూలంగా పనులు చేస్తున్నారని మండిపడ్డారు. "బనకచర్లపై చర్చే జరగలేదని రేవంత్ రెడ్డి బుకాయిస్తున్నారు. బనకచర్లపై చర్చ జరిగిందని ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ మంత్రి నిమ్మల చెప్పారు. కేంద్రం విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో కూడా ఈ అంశం స్పష్టంగా ఉంది. అందుకే తెలంగాణ హక్కులను కాలరాసిన నాన్ సీరియస్ ముఖ్యమంత్రి తన పదవి రాజీనామా చేయాలి. తన స్కూల్ బీజేపీ, కాలేజీ టీడీపీ, ఉద్యోగం కాంగ్రెస్‌లో అని సీఎం చెప్పారు. ముఖ్యమంత్రి ఇంకా కాలేజ్‌లోనే ఉన్నానని అనుకుంటున్నారు. అందుకే గోదావరి నీళ్లను చంద్రబాబుకు గిఫ్టుగా ఇచ్చారు. " కవిత కామెంట్స్ చేశారు. బనకచర్ల, పోలవరంపై న్యాయపోరాటం చేస్తామని అన్నారు కవిత. ఈ దేశ న్యాయవ్యవస్థలపై తమకు నమ్మకం ఉందని చెప్పుకొచ్చారు. పార్లమెంట్ సమావేశాల టైంలో తెలంగాణ అఖిలపక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. "బనకచర్ల ఆపకపోతే న్యాయపోరాటం చేస్తాం. తెలంగాణ జాగృతి తరపున న్యాయ పోరాటం చేసి బనకచర్ల ఆపి తీరుతాం. తుపాకులగూడెం నుంచి నదుల అనుసంధానం జరిగితే తెలంగాణ,ఆంధ్రాకు న్యాయం జరుగుతుంది. పార్లమెంట్ సమావేశాలు టైంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలి. సీఎం రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చంద్రబాబును ఎదుర్కొని సన్మానం చేశారు. ఇద్దరూ సిగ్గులేకుండా బనకచర్ల ప్రాజెక్టును అప్పనంగా అప్పగించారు. సీఎం రేవంత్ రెడ్డికి పాలించే హక్కు లేదు తక్షణమే సీఎం పదవికి రాజీనామా చేయాలి."ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై కూడా కవిత రియాక్ట్ అయ్యారు. ఆయన్ని జనాభా లెక్కలోనుంచి తీసేసానని అన్నారు. ఆయన ఎవరో కూడా తనకు తెలియదని కామెంట్ చేశారు. ఆయన గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని అభిప్రాయపడ్డారు. కొప్పుల ఈశ్వర్ టీఆర్ఎస్ బొగ్గుగని కార్మిక సంఘ బాధ్యతలు అప్పగించడాన్ని కవిత స్వాగతించారు. ఆయన స్వయంగా బొగ్గుగని కార్మికుడని వారి బాధలు తెలుసని చెప్పుకొచ్చారు.

# రెన్యూవబుల్ ఎనర్జీ కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వ సహకారం కావాలి

**ఢిల్లీ:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి లేఖ రాశారు. ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థలు ప్రతిపాదించిన పునరుత్పాదక ఇంధన (రెన్యూవబుల్ ఎనర్జీ) కార్యక్రమాలపై తెలంగాణ ప్రభుత్వ సహకారం కోరుతూ లేఖలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ముఖ్యంగా కోల్ ఇండియా లిమిటెడ్ నేవేలీ లిగ్నయిట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం కుదుర్చుకుని, సౌర, పవన విద్యుత్ ప్లాంట్లు, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ వంటి కీలకమైన పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని కిషన్‌రెడ్డి లేఖలో తెలిపారు. ఈ ప్రాజెక్టులు వచ్చే మూడేళ్లలో దాదాపు రూ.10 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్శించనున్నాయి.

**లేఖలో కీలక ప్రతిపాదనలు:**

తెలంగాణలోని అధిక సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం గల జోన్‌లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను అభివృద్ధి చేయడం.

గ్రిడ్ స్టెబిలిటీ, ఎనర్జీ రిలయబిలిటీలను మరింత పెంచేలా అత్యాధునిక బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ను అభివృద్ధి చేయడం.

క్రిటికల్ బ్యాలెన్సింగ్ కెపాసిటీని అందించేందుకు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాల అధ్యయనం, అమలు.

ప్రాజెక్టు అమలును వేగవంతం చేయడానికి, స్థానిక ఆర్థిక ప్రయోజనాలను పెంచడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ



సంస్థలతో లేదా బొగ్గు కంపెనీలు స్వతంత్ర ప్రాతిపదికన జాయింట్ వెంచర్ మోడల్స్ ఏర్పాటు చేయడం.

ఈ ప్రతిపాదనలు, ప్రాజెక్టులకు భూసేకరణ, భూకేటాయింపు కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మద్దతు అవసరం.

ఈ ప్రాజెక్టులు కర్బన ఉద్గారాలను తగ్గించడం, గాలి నాణ్యతను మెరుగుపరచడం, సహజ వనరుల నిర్వహణ తదితర విషయాల్లో కీలక పాత్ర పోషిస్తాయి. వీటి ద్వారా ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధి, ఇంధన భద్రతతోపాటుగా, అవసరమైనంత మేర విద్యుత్ ను అందుబాటులోకి తీసుకురావడం, సమ్మిళిత అభివృద్ధి, జీవన ప్రమాణాలను పెంచడం వంటి సామాజిక-ఆర్థిక ప్రయోజనాలు కూడా లభించనున్నాయి. ఈ ప్రాజెక్టులు విజయవంతంగా అమలుకావడానికి రాష్ట్ర ప్రభుత్వం, %ఙూఖ%ల మధ్య నిర్మాణాత్మక భాగస్వామ్యం, సరైన సమన్వయం అత్యంత అవసరం. ఇందుకోసం మీరు ప్రత్యేకమైన చొరవతీసుకోవాలని కోరుతున్నాను. మీ జోక్యంతోనే ఈ ప్రాజెక్టులు వేగంగా, సమర్థవంతంగా అమలు అవుతాయని విశ్వసిస్తున్నాను.

పునరుత్పాదక విద్యుదుత్పత్తిలో తెలంగాణ సామర్థ్యాన్ని గుర్తిస్తూ.. రాష్ట్రంలో హరితాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణమైన చిత్తశుద్ధితో సహకారం అందిస్తోంది. ఇది రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. భారతదేశ సుస్థిర విద్యుత్ వ్యవస్థలో తెలంగాణ పాత్ర కీలకం కానున్న సందర్భంలో.. ఈ ప్రాజెక్టుల ప్రాధాన్యత మరింత పెరగనుంది. తెలంగాణకు ఉన్న పునరుత్పాదక విద్యుదుత్పత్తి సామర్థ్యం, హరితాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిబద్ధతను దృష్టిలో ఉంచుకుని.. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని మరో మెట్టు ముందుకు తీసుకెళ్తాయి. దీంతోపాటుగా భారతదేశం సుస్థిర ఇంధన పరివర్తన దిశగా చేస్తున్న కృషిలో తెలంగాణ కీలక పాత్ర పోషించడానికి ఇదొక చక్కటి అవకాశం. భారతదేశపు దీర్ఘకాల ప్రణాళికలైన ఇంధన భద్రత, పర్యావరణ పరిరక్షణను సాకారం చేసుకోవడంలో భాగంగా ఆర్థిక పురోగతిని, అభివృద్ధి అవకాశాలను సమతుల్యం చేసుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అత్యంత కీలకం.

పర్యావరణ పరిరక్షణతో పాటుగా ఆత్మ నిర్భరతతో కూడిన భవిష్యత్‌ను ఏర్పరచుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నిర్మాణాత్మక సహకారంలో మీ చొరవ కీలకం. తెలంగాణలో రానున్న ఈ సానుకూల మార్పుకు మీ సహకారాన్ని కోరుతూ.. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, మా శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థలనుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు.

# ఏ క్షణమైనా నోటిఫికేషన్?

-మొదటిపేజీ తరువాయి

కల్పించేందుకు అవసరమైన ఆర్డినెన్స్‌ను సిద్ధం చేసి ఇప్పటికే గవర్నర్‌కు పంపింది. గవర్నర్ ఆమోదం లభించిన వెంటనే రాష్ట్రంలో స్థానిక ఎన్నికలకు అధికారికంగా తెరలేవనుంది. రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ఐదు విడతల్లో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. వర్షాకాలం, శాంతిభద్రతల పరిస్థితి, గిరిజన ప్రాంతాలకు పోలింగ్ సిబ్బంది రవాణా, పోలింగ్ మెటీరియల్ తరలింపు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 2019లో ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించగా, అప్పుడు వేసవి కావడంతో అది సాధ్యమైంది.ఇప్పుడు వర్షకాలం కావడం, దానివల్ల ఎదురయ్యే ఇబ్బందులను అంచనా వేసి ఈసారి ఐదు విడతల్లో నిర్వహించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ప్రభుత్వం రిజర్వేషన్ల సమాచారాన్ని అందించిన వెంటనే ఎన్నికలకు సిద్ధమయ్యేందుకు కసరత్తు జరుగుతోంది. పోలింగ్ స్టేషన్లు, ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్ అధికారులు ఇప్పటికే




సిద్ధం చేశారు. ఐదు విడతల్లో ఎన్నికలు నిర్వహించడం వల్ల పోలింగ్ సిబ్బంది, పోలీసుల తరలింపు సులువు అవుతుందని, పర్యవేక్షణలోనూ ఎలాంటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. వర్షాల వల్ల రవాణాకు, ఓటింగ్‌కు ఆటంకం కలగకుండా ఉండేందుకు ఈ నిర్ణయానికి వచ్చారు. నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి పోలింగ్ వరకు మధ్య ప్రక్రియను పూర్తి చేయడానికి దాదాపు 15 రోజుల సమయం అవసరం. 2019 ఎన్నికల సమయంలో ఒక్కో దశకు నాలుగు రోజుల విరామం ఇవ్వగా, ఈసారి రెండు నుంచి మూడు రోజులు మాత్రమే ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం రిజర్వేషన్ల సమాచారం అందించిన తర్వాత, పోలీసు అధికారులతో సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటారు. మొదట ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ రెండు ఎన్నికలకు ఒకే రోజు పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ ఎన్నికలు రాష్ట్రంలో గ్రామీణ, మండల స్థాయిలో కొత్త నాయకత్వాన్ని ఎన్నుకోవడానికి మార్గం సుగమం చేయనున్నాయి.

## సంపాదకీయం

# ప్రకంపనలు సృష్టిస్తున్న పదవీవిరమణ

బిజెపిలో 75 ఏళ్లకు అన్ని అధికార, పార్టీ పదవుల నుండి నిష్క్రమించాలనే నిర్దుష్టమైన నిబంధన ఏమీ లేనప్పటికీ ఈ అంశం ఇప్పుడు ఆ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తున్నది. ముఖ్యంగా ఆర్ఎస్ఎస్ అధినేత డా. మోహన్ భగవత్ గత వారం మరో సందర్భంలో సీనియర్ సంఘ్ నేత మోరోపంత్ పింగ్లేపై రాసిన గ్రంథాన్ని ఆవిష్కరిస్తూ ఆయన అన్నమాటలను ఉటంకించడంతో పరోక్షంగా బిజెపి నాయకులకు ఆయన సందేశం ఇచ్చారనే కథనాలు వ్యాపిస్తున్నాయి. ప్రస్తుత రాజకీయాలను, రాజకీయ నాయకులను దృష్టిలో ఉంచుకొని ఆ విధమైన మాటలు చెప్పలేదని అంటూ ఆ తర్వాత ఆర్ఎస్ఎస్ వివరణ ఇవ్వడం గమనిస్తే ఆయన ప్రకటన రాజకీయంగా ఎంతటి కలకలం రేపిందో వెల్లడి చేస్తున్నది. అయితే, ఆయన ప్రకటన కన్నా ముందే రోజే కేంద్ర హోం మంత్రి అమిత్ షా తన రాజకీయ రంగ నిష్క్రమణ గురించి ప్రస్తావించడం కూడా ఈ కలకలంకు ఆజ్యం పోసింది. ఇదంతా మరో రెండునెలల్లో ప్రధాని నరేంద్ర మోడీ 75 ఏళ్ళ వయస్సుకు రాజకీయ ప్రకంపనలకు దారితీస్తున్నది. దానితో తాను ఏర్పర్చిన ఈ నిబంధనను ప్రధాని తాను ఏమేరకు పాటిస్తారో అన్న ఆసక్తి అన్ని వర్గాలలో సహజంగానే నెలకొంటుంది. 2015లో ప్రధాని పదవి చేపట్టగానే (%ఖుంంబఎఅఅస్త్ర శీటటఅఎివ ుాతీఅఎివ వీఅఅఅర్వతీ%) పార్టీ ప్రారంభంనుండి కీలకంగా వ్యవహరిస్తూ వస్తున్న ఎల్కె అద్వానీ, మురళీ మనోహర్ జోషి, శాంత కుమార్ వంటి వారికి కనీసం పార్టీ పార్లమెంటరీ బోర్డులో కూడా స్థానం లేకుండా చేయడంతో అనధికారికంగా అటువంటి నిబంధన పార్టీలో అమలు చేయడం ప్రారంభించారు. 'మార్గదర్శకులు' అంటూ వారికి ఓ హోదాను కట్టబెట్టినప్పటికీ అటువంటి వారితో ఇప్పటి వరకు ఒక సమావేశం కూడా జరపకపోవడం గమనార్హం. అప్పటినుండి అనేకమంది నాయకులను గవర్నర్లు, మంత్రులు, పార్టీ పదవులనుండి ఈ నిబంధన పేరుతో తొలగిస్తూ వస్తున్నప్పటికీ రాజకీయ అవసరాలకోసం 80 ఏళ్ళు పైబడిన వారికి సైతం ఎన్నికలలో సీట్లు ఇవ్వడం, నామినేట్ పదవులు ఇవ్వడం చేస్తూనే ఉన్నారు. అయితే, ఇప్పుడు అమిత్ షా తన రాజకీయ నిష్క్రమణ గురించి ఎందుకు ప్రస్తావించారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎందుకంటే ఆయన మరో 15 ఏళ్లకు గాని 75 ఏళ్ళ పరిధికి చేరుకోరు. రాజకీయాల నుండి నిష్క్రమిస్తే తాను వేదాలు, ఉపనిషత్తులు చదువుకుంటూ ప్రకృతి వ్యవసాయం చేసుకుంటూ గడుపుతానని చెప్పడం ద్వారా చివరికంటా పదవులను పట్టుకొనే వేలాడననే సంకేతం ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే ఆయన వ్యవసాయం చేస్తారని ఎవ్వరూ విశ్వసించే పరిస్థితి లేదు. కేవలం ఓ రాజకీయ ఎత్తుగడగా ఈ ప్రకటన చేశారని స్పష్టం అవుతుంది. నేటి జాతీయ నాయకులలో వ్యక్తిగత విషయాలపై బహిరంగంగా ఎప్పుడూ మాట్లాడని నాయకుడు అమిత్ షా. కేవలం ఈ మధ్య ఒకసారి తన ఇద్దరు మనవరాళ్లతో కలిసి ఉన్న ఫోటోను పంచుకున్నారు. కుటుంబ విషయాలను మీడియావారు ప్రస్తావించినా నిర్మొహమాటంగా సమాధానం ఇచ్చేందుకు నిరాకరిస్తారు. అటువంటిది ఈ విషయం గురించి ప్రసావించడం సహజంగానే రాజకీయంగా ఆసక్తి కలిగిస్తుంది. ఆయన ఈ ప్రకటన మహిళా బృందాలతో మాట్లాడుతున్నప్పుడు చేశారు. సహకార మంత్రిగా వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు తీవ్రంగా కృషిచేస్తున్నట్లు చెబుతూ వారికి నేరుగా వారి బ్యాంకు అకౌంటులలో చెల్లింపులు జరిగేటట్లు చూడటమే తన అభిలాష అని చెప్పారు. అయితే, ఈ లక్ష్యం నెరవేరేందుకు ఓ పదేళ్లు పట్టవచ్చని చెప్పడం ద్వారా మరో పదేళ్లు అధికారంలో కొనసాగుతానని సంకేతం ఇదే సమయంలో ఇచ్చారు. బిజెపి అధ్యక్ష ఎన్నిక విషయంలో ప్రతిష్టంభన నెలకొనడంతో ఆయన కొంత అసహనంగా ఉన్నారనే ప్రచారం జరుగుతుంది. గత 11 ఏళ్లుగా పార్టీ వ్యవహారాలు అన్ని ఆయన కనుసన్నలలో జరుగుతున్నాయి. తన తర్వాత ఐదున్నరేళ్లుగా జెపి నడ్డా అధ్యకునిగా ఉంటున్నప్పటికీ మొత్తం అధికారం అమిత్ షా చేతుల్లోనే కొనసాగుతున్నది. పార్టీకి సంబంధించిన అన్ని వ్యవహారాలు ఆయన అభీష్టం మేరకే జరుగుతున్నాయి. అందుకనే నడ్డా వారసునిగా సహజంగా తాను ఎంపిక చేసేవారే ఉండాలని కోరుకుంటారు. కానీ, గత ఏడాది లోక్సభ ఎన్నికల సందర్భంగా ఒక ఇంటర్వ్యూలో బిజెపి ఎంతో ఎదిగిందని, ఇంకా తమకు ఆర్ఎస్ఎస్ మద్దతు అవసరం లేదని, సొంతంగా తమ వ్యవహారాలు చక్కబెట్టుకోగలమని చెప్పడం ద్వారా నడ్డా పార్టీకి ఎంతో నష్టం కలిగించారు. ఆయన మాటల ప్రభావమో, మరేమిటో గాని 400 సీట్లు గెలుస్తామని ప్రచారం చేసుకుంటే సొంతంగా మెజారిటీ కూడా లేకుండా 240 సీట్లకు పరిమితం కావాల్సి వచ్చింది. ఆ తర్వాత జరిగిన మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో కేవలం ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ప్రతిష్ఠాకరంగా పనిచేయడంతోనే ఓటమి నుండి బిజెపి విజయంవైపు ప్రయాణం చేయగలిగింది. పైగా, ప్రధాని మోడీ ప్రచారంతో మాత్రమే ఓట్లు పొందే పరిస్థితులు కూడా కనిపించడం లేదు. అందుకనే ఆర్ఎస్ఎస్ సూచనలను కాదని పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకుంటే రాబోయే రోజులలో భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందనే భయం పార్టీ వర్గాలలో ఉంది. ఆర్ఎస్ఎస్ సైతం పార్టీ అధ్యక్ష పదవికి ఓ నిర్దిష్టమైన పేరు సూచింపకుండా, ఓ బృందంగా పనిచేస్తూ, పార్టీని సంస్థాగతంగా పటిష్టపరిచే వారిని ఎనుకోవాలని మాత్రమే చెబుతున్నట్లు తెలుస్తున్నది. ఈ విషయంలో ఆర్ఎస్ఎస్ బిజెపి మధ్య ఏకాభిప్రాయం ఏర్పడటంలేదని చెబుతున్నారు. ఓ విధంగా మొత్తం పార్టీ వ్యవస్థను ఈ మధ్య కాలంలో తలాకుతలం కావించారు. విధానపరమైన విషయాలపై పార్టీలో చర్చలు జరగడంలేదు. ఎక్కువగా సోషల్ మీడియాపై, ప్రచార వ్యూహాలపై దృష్టి సారిస్తున్నారు. జెపి నడ్డా పదవీకాలం జనవరి, 2023లోనే అయిపోయింది. అప్పటినుండి ఏదో ఒక సాకుతో ఆయన పదవీకాలాన్ని పొడిగిస్తూ మరో అధ్యక్షుడిని ఎన్నుకోలేకపోతున్నారు. బిజెపి అధ్యక్షుడి పదవీకాలం మూడేళ్లు మాత్రమే. కానీ 2014 నుండి అమిత్ షా, ఆ తర్వాత జెపి నడ్డా మాత్రమే అధ్యక్షులుగా ఉన్నారు. పార్టీ నిబంధనల మేరకు ఈ పాటికి నాలుగో అధ్యక్షుడు ఉండాల్సి ఉంది. గతంలో బిజెపి నాయకత్వంలో ఎన్ని సమస్యలు ఉన్నప్పటికీ సంస్థాగత వ్యవహారాలు క్రమబద్ధంగా జరుగుతూ ఉండెడివి. ప్రతి ఏడాది రెండు సార్లు జాతీయ మండలి సమావేశాలు, మరో రెండు సార్లు జాతీయ కార్యవర్గ సమావేశాలు జరుపుతూ ఉండేవారు. కానీ ఇప్పుడు చాలా అరుదుగా సమావేశాలు జరుపుతున్నారు. చివరకు 2024 పార్లమెంట్ ఎన్నికల అనంతరం ఇప్పటి వరకు బిజెపి ఎంపిల సమావేశాలే జరపడం లేదు. ప్రజాస్వామ్య సంప్రదాయం ప్రకారం కూటమి ప్రభుత్వం ఉంటే, కూటమిలో పెద్ద పార్టీ ఎంపిలు ముందుగా తమ నాయకుడిని ఎన్నుకొని, ఆ నాయకుడికి ఇతర మిత్రపక్షాల మద్దతు తీసుకొనేవారు. కానీ, ఆశ్చర్యకరంగా 2024 ఎన్నికల అనంతరం ఎన్డిఎ ఎంపిల సమావేశం జరిపే, అందులో నరేంద్ర మోడీని నాయకునిగా ఎన్నుకున్నారు. అంతకు ముందు పార్లమెంట్ సమావేశాల సమయంలో ప్రతి వారం బిజెపి ఎంపిలు సమావేశమై సమావేశాల తీరుతెన్నులు, వ్యూహాలపై చర్చించేవారు. కానీ ఇప్పుడు ఎన్డిఎ ఎంపిల సమావేశాలు జరుగుతున్నాయి గాని, విడిగా బిజెపి ఎంపిల సమావేశాలు జరపడం లేదు. పార్టీ ఎంపీల సమావేశాలు జరిగితే విధానపరమైన అంశాలపై నేతలను ప్రశ్నించేందుకు కనీసం 50 మంది ఎంపీలు సిద్ధంగా ఉన్నారని, అందుకనే దాటవేస్తున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. ఏదిఏమైనా ప్రధాని మోడీ 75 ఏళ్ళు రాగానే రాజీనామా చేయాల్సిన అవసరం లేదని ఇప్పటికే అమిత్ షా, దేవేంద్ర ఫడ్నవీస్ వంటి నేతలు స్పష్టం చేశారు. 2024 ఎన్నికలలో ఆయనను ఐదేళ్లపాటు ఎన్నుకున్నారని, అందుకనే 2029 వరకు ఆయనే కొనసాగుతారని నిషికాంత్ దూబే వంటి వారు స్పష్టం చేస్తున్నారు. అయితే ఆర్ఎస్ఎస్లో కొంతకాలంగా ఈ నిబంధనను పాటిస్తూవస్తున్నారు. ఇప్పుడు మోడీ కూడా పాటించాలని కోరుకోవడం సహజమే కాగలదు. ఆ మేరకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. అందుకనే ఈ అంశం ఇప్పుడు రాజకీయంగా ప్రాధాన్యత సంతరింప చేసుకుంటుంది. ఒక వంక ప్రధాని మారి, పార్టీకి కొత్త అధ్యక్షుడు కూడా వస్తే మొత్తం పార్టీ, ప్రభుత్వ వ్యవహారాలు పూర్తిగా మారిపోయే అవకాశం ఉంది. అందుకనే సహజంగానే ప్రస్తుతం కీలకంగా వ్యవహరిస్తున్నవారు అటువంటి మార్పును స్వాగతిపలేరు.

# విలక్షణ నటుడు ఎస్వీ రంగారావు

తెలుగు సినీ చరిత్రలో ఒక ప్రత్యేక విలక్షణ నటులు ఎస్వీ రంగారావు. రంగారావు తన నటనలో ఆంగిక, వాచిక, ఆహార్య, సాత్వికా భినయాలు కలబోసిన నటుడు. సహజ నటుడిగా పేరు గాంచారు. పౌరాణిక, సాంఘిక, చారిత్రిక, ఐతిహాసిక పాత్రలు ఏవైనా వాటిల్లో పరకాయ ప్రవేశం చేసి, అందరి మన్ననలు పొందిన మహానటులు యస్వీఆర్. నవరసాలను అలవోకగా అవలీలగా పాత్రల ద్వారా ఒలికించిగల అతికొద్ది మంది నటుల్లో ఎస్వీఆర్ ది అగ్రస్థానం. ఎస్వీ రంగారావు కృష్ణా జిల్లా లోని నూజివీడులో, 1918 జూలై 3 వ తేదీన జన్మించారు. మద్రాసు హిందూ హైస్కూలులో తన పదిహేనవ ఏట మొదటి సారిగా నాటకంలో నటించారు. తన నటనకు అందరి నుంచి ప్రశంసలు రావడంతో ఆయనలో నటుడు కావాలన్న కోరికకు బీజం పడింది. తర్వాత పాఠశాలలో ఏ నాటకం వేసినా ఏదో ఒక పాత్రలో నటించేవారు. వక్తృత్వ పోటీల్లో పాల్గొనేవారు. క్రికెట్, వాలీబాల్, టెన్నిస్ క్రీడల్లోనూ ప్రవేశం ఉండేది. 1936 లో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు ఉత్సవాలలో రంగారావు బళ్ళారి రాఘవ, గోవిందరాజు సుబ్బారావు లాంటి ప్రఖ్యాత నటులను చూసి తాను కూడా ఎలాగైనా నటుడు అవ్వాలనుకున్నారు. మద్రాసులో ఎక్కడ తెలుగు నాటకాలు జరుగుతున్నా హాజరయ్యేవారు. అన్ని భాషల సినిమాలు శ్రద్ధగా చూసేవారు. వాటిని విశ్లేషించేవారు. ఇంటర్ పరీక్షకు 45 మంది హాజరయితే అందులో రంగారావు ఒక్కడే ఉత్తీర్ణుడు కావడం విశేషం. రంగారావు కు మాత్రం నటుడు కావాలనే కోరిక బలంగా ఉండేది. బాగా చదువుకుంటూనే నటనను కూడా వదిలి పెట్టలేదు. కాకినాడ లోని యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ లో చేరి ఎన్నో నాటకాల్లో పాల్గొన్నారు. ఆయనకు ఇక్కడ అంజలీదేవి, ఆదినారాయణ రావు, బి.ఎ.సుబ్బారావు, రేలంగి వంటి వారితో పరిచయం ఏర్పడింది. నాటకాల్లో రంగారావు అనేక వైవిధ్యమైన పాత్రలు పోషించారు. పీష్వా నారాయణరావు వధ నాటకంలో రంగారావు ఇరవై రెండేళ్ళ వయసులో అరవై ఏళ్ళ వృద్ధుని పాత్ర ధరించి మెప్పించారు. ఖిల్జీ రాజ్యపతననం నాటకంలో మాలిక్ కపూర్ పాత్రలో, స్ట్రీట్ సింగర్ నాటకంలో విలన్ పాత్ర మొదలైన పాత్రలు పోషించారు. రంగారావు కు ఇంగ్లీషు మీద కూడా పట్టు ఉండటంతో షేక్స్పియర్ నాటకాల్లోని సీజర్, ఆంటోనీ, షైలాక్ లాంటి పాత్రలు పోషించేవారు. నాటకాలు వేస్తూనే బి. ఎస్. సి పూర్తి చేశారు. మొదట బందరు లో తర్వాత విజయ నగరంలో ఫైర్ ఆఫీసరు గా పనిచేశారు. ఈ ఉద్యోగంలో రంగారావుకు పెద్దగా పని ఉండేది కాదు. కానీ ఉద్యోగ స్వభావ రీత్యా ఖాళీ సమయాల్లో నటించడానికి వీలులేదు. తాను కళకు దూరం అవుతున్నేనేమో నని భావించిన రంగారావు ఆ ఉద్యోగం నుంచి బయటకు వచ్చేశారు. ఆయన నటించిన మొట్టమొదటి చిత్రం 1946లో వచ్చిన వరూధిని అనే చిత్రం. తొలి సినిమాలో పాత్ర పోషించినందుకు గాను రూ.750



పారితోషికంగా అందుకున్నారు. ఎల్. వి. ప్రసాద్ దర్శకత్వంలో వచ్చిన మనదేశం, పి. పుల్లయ్య దర్శకత్వంలో వచ్చిన తిరుగుబాటు చిత్రంలో కూడా అంతగా ప్రాధాన్యం లేని పాత్రలే వచ్చాయి. అయినా రంగారావు నిరుత్సాహ పడకుండా మంచి అవకాశం కోసం ఎదురుచూడ సాగారు. నాగిరెడ్డి, చక్రపాణి కలిసి విజయా ప్రొడక్షన్స్ అనే నిర్మాణ సంస్థను స్థాపించారు. ఈ సంస్థ తొలిసారిగా నిర్మించిన షావుకారు సినిమాలో సున్నపు రంగడు అనే కీలకమైన పాత్రను రంగారావు కిచ్చారు. ఈ సంస్థలో ప్రవేశించడం రంగారావు కెరీర్ కు గట్టి పునాది పడింది. తర్వాత అదే సంస్థ నిర్మించిన పాతాళ భైరవి (1951) సినిమాలో అతి ముఖ్యమైన మాంత్రికుడి పాత్రను రంగారావు కిచ్చారు. పరభాషా సినిమాలు కూడా ఎన్నో పేరు ప్రఖ్యాతులు సంపాదించి పెట్టాయి. హిందీ భాషలో ప్రవేశమున్న రంగారావు తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పుకున్నారు. భానుమతి దర్శక నిర్మాత వచ్చిన నాది ఆడజన్మే ఆధారంగా హిందీలో తీసిన మై భీ లడ్కీ హూ లాంటి హిందీ చిత్రాల్లో నటించారు. భూకైలాస్, మాయాబజార్ లాంటి కన్నడ చిత్రాలలోనూ, విదయాగలే ఎతిలే ఎతిలే, కవిత వంటి మలయాళ చిత్రాలలో కూడా నటించారు. నటసామ్రాట్, విశ్వనట చక్రవర్తి మొదలగు బిరుదులతో తెలుగు ప్రేక్షకులు ఆయన్ను గౌరవించారు. ఎస్వీయార్ నటించిన నర్తనశాల ఇండొనేషియా లోని జకార్తాలో ఆఫ్రో–ఆసియా అంతర్జాతీయ చిత్రోత్సవము?లో ప్రదర్శించ బడడమే కాకుండా కీచకపాత్రకు గాను ఎస్వీయార్ అప్పటి ఎన్నో చిత్రాల కథా నాయకులను వెనుకకు నెట్టి భారతదేశం నుంచి తొలి అంతర్జాతీయ ఉత్తమ నటుడుగా బహుమతి పొందారు. కొన్ని చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. ముఖ్యంగా ఆయన దర్శకత్వం వహించిన చదరంగం చిత్రానికి రెండో ఉత్తమ చిత్రంగా నంది పురస్కారం లభించింది. రెండో చిత్రం బాంధవ్యాలు ఉత్తమ చిత్రంగా నంది పురస్కారం అందుకున్నది. మొదటి సినిమా వైఫల్యం తర్వాత రంగారావు జంషెడ్పూర్ లో టాటా కంపెనీలో ఉద్యోగం లో చేరారు. ఇదే సమయంలో ఆయన మేనమామ బడేటి వెంకట రామయ్య, కోటేశ్వరమ్మ దంపతుల కుమార్తె లీలావతిని 1947 డిసెంబరు 27న వివాహం చేసుకున్నారు. వ్యక్తిగా రంగారావు చమత్కారి, సహృదయుడు. సినిమా సెట్స్ మీద గంభీరంగా ఉండేవారు. వ్యక్తిగత విషయాలు సహనటులతో చర్చించడానికి ఇష్టపడేవారు కాదు. ఆయన ఇష్టదైవం శివుడు. ప్రతిరోజూ శివపూజ చేసిన తర్వాత దినచర్య ప్రారంభించేవారు. యస్వీఆర్ ఒక వేదాంతి. ఆయన ఇంటి లైబ్రరీలో వివేకానందునికి సంబంధించిన పుస్తకాలు ఎన్నో ఉండేవి. తానే స్వయంగా కొన్ని రచనలు కూడా చేశారు. ప్రజాహిత సంస్థలకు లెక్కలేనన్ని విరాళాలు ఇచ్చారు. చైనాతో యుద్ధం వచ్చినపుడు ఏర్పాటు చేసిన సభలో పదివేల రూపాయలు విరాళం ఇచ్చారు. తర్వాత పాకిస్తాన్తో యుద్ధం వచ్చినపుడు కూడా ఎన్నో సభలు నిర్వహించి, మిగతా నటులతో కలసి ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి, విరాళాలు సేకరించి, ఆ డబ్బును రక్షణ నిధికి ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ లో ఏలూరు, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, పాలకొల్లు, సామర్లకోట, పెనుగొండ, అనకాపల్లి లాంటి ఊర్లలో ఆయనకు సన్మానాలు జరిగాయి. జకార్తాలో పురస్కారం అందుకుని మద్రాసు వచ్చాక మద్రాసు సోషల్ అండ్ కల్చరల్ క్లబ్ , ఆంధ్రా ఫిల్మ్ జర్నలిస్టు సంఘం , దక్షిణ భారత ఫిల్మ్ వాణిజ్య మండలి, మద్రాసు సినిమా ప్రేక్షక సంఘాలు ఘనంగా సన్మానించారు. అన్నై, శారద, నానుం ఒరుపెణ్, కర్పగం, నర్తనశాల సినిమాలకు భారత రాష్ట్రపతి చేతుల మీదుగా పారితోషికం స్వీకరించారు. విశ్వనటచక్రవర్తి, నటసార్వభౌమ, నటసింహ, నటశేఖర తదితర బిరుదులు పొందారు. రంగారావు దర్శకత్వం వహించిన మొదటి చిత్రం చదరంగం ద్వితీయ ఉత్తమ చిత్రంగా నంది అవార్డును, రెండవ చిత్రం బాంధవ్యాలు తొలి ఉత్తమ చిత్రంగా నంది అవార్డును గెలుచుకున్నాయి. నర్తనశాల చిత్రంలో నటనకు ఇండోనేషియా ఫిలిం ఫెస్టివల్లో ఉత్తమ నటుడి అవార్డు, అదే పాత్రకు రాష్ట్రపతి అవార్డు అందుకున్నాడు. 2013 లో భారత సినీ పరిశ్రమ వందేళ్ళ సందర్భంగా విడుదలయిన తపాలాబిళ్ళలలో ఒకటి ఎస్వీ రంగారావు మీద విడుదలయింది. రంగారావుకు తొలినాళ్ళలో మంచి పేరు తెచ్చిన షావుకారు చిత్రంలోని సున్నం రంగడి పాత్ర కోసం తన స్వగ్రామంలో కోడి రంగడు అనే రౌడీని మనసులో పెట్టుకుని అతని మాట తీరుని, ప్రవర్తనా విధానాన్ని అనుకరించారు. సంతానం చిత్రంలో ఆయన పోషించిన గుడ్డివాని పాత్ర కోసం కొన్నాళ్ళు పాటు అంధుల ప్రవర్తనను గమనించారు. మాంత్రికుడి పాత్ర కూడా తాను ఆంగ్ల నాటకాల్లో ధరించిన షైలాక్ పాత్రలను ఆధారంగా చేసుకుని మరింత రౌద్రరసాన్ని కలిపి తనదైన శైలిలో నటించారు. రంగారావు యుముడి పాత్ర పోషించిన సతీ సావిత్రి సినిమా మద్రాసులో జెమినీ స్టూడియోలో చిత్రీకరణ జరుగుతుండగా మద్రాసు పర్యటనకు వచ్చిన చైనా ప్రధాని చౌ ఎన్ లై ఈయన నటనను అభినందించారు. జులై 3, 2018న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఏలూరులో పన్నెండున్నర అడుగుల ఎత్తైన రంగారావు కంచు విగ్రహాన్ని ఆవిష్కరించారు. 1974 జూలై 18వ తేదీన మద్రాసులో కన్ను మూశారు.

# సామాజిక మార్పుకు సాధనం సాహిత్యం

రెంటాల గోపాలకృష్ణ, (5 సెప్టెంబర్ 1920 –18 జూలై 1995) తెలుగు సాహిత్య భూమికపై తనదైన ముద్ర వేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. రచయిత, పాత్రికేయుడు, సంపాదకుడు, విమర్శకుడు, అనువాదకుడు, నాటకకర్తగా ఆయన సాహిత్య సేవ విస్తృత పరిధిని కలిగి ఉంది. భావ ప్రకటనను సామాజిక బాధ్యతగా స్వీకరించి, సాహిత్యాన్ని సామాజిక మార్పుకు సాధనంగా మలచిన రచయితగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. గుంటూరు జిల్లా రెంటాల గ్రామంలో 1920లో జన్మించిన గోపాలకృష్ణ, బాల్యంలోనే పఠనంపై ఆసక్తి కలిగి చరిత్ర, ఆర్థికశాస్త్రాలలో విద్యాభ్యాసం చేశారు. విద్యాభ్యాసం తరువాత పాత్రికేయ వృత్తిలోకి అడుగుపెట్టి, 'ఆంధ్రప్రభ' పత్రికలో ఉపసంపాద కుడిగా తన జర్నలిజం జీవితాన్ని ప్రారంభించారు. ఆపై 'ఈనాడు' పత్రికలో కీలక పదవులు నిర్వహించారు. వార్తలను సామాజిక రాజకీయ విశ్లేషణతో సమన్వయం చేస్తూ, నూతన దృక్పథాన్ని పాఠకుల ముందు ఉంచారు. ఆయన రాసిన సంపాదకీయాలు పాఠకుల ఆలోచనా సరళిని ప్రభావితం చేశాయి. పత్రికా రచనను ప్రాణంలా భావించిన గోపాలకృష్ణ, మాతృభూమి, అభ్యుదయ, విజయప్రభ, ఆనందవాణి, ఆంధ్రజ్యోతి వారపత్రిక, స్వాతి మాసపత్రిక, బాలజ్యోతి పిల్లల పత్రిక వంటి అనేక ప్రముఖ ముద్రిత మాధ్యమాల్లో రచనలు కొనసాగించారు. వార్తల వెనుకనున్న సంక్లిష్టతను విశ్లేషించి ప్రజలకు చేరువ చేసే శైలితో ఆయన పాత్రికేయత విలక్షణంగా నిలిచింది. ఆయన కలం మానవీయ విలువలకు ప్రతిబింబంగా మారింది. సాహిత్య రంగంలో కూడా గోపాలకృష్ణ అభినవ దిశల్లో ప్రయాణించారు. ఇది నా కథ కాదు, కాలం కాకిలా ఎగిరింది, మనిషి స్వప్నం వంటి నవలల్లో వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక నిరంకుశత, కుల వ్యవస్థలపై పోరాటం వంటి అంశాలను శక్తివంతంగా చిత్రించారు. ఆయన కథలు చిన్నవైనా భావ వ్యాప్తి లోతుగా, మానవ స్వభావం లోని అంతర్లీన సంఘర్షణలను ప్రతిఫలించే విధంగా ఉండేవి. ఆయన రచనల్లో సామాజిక స్పృహ



స్పష్టంగా ప్రతిఫలించేది. అనువాద రంగంలో గోపాలకృష్ణ చేసిన కృషి విశేషంగా నిలిచింది. ముఖ్యంగా మార్క్సిస్ట్ సిద్ధాంతాలకు సంబంధించిన పలు ఆంగ్ల గ్రంథాలను తెలుగులోకి అనువదించి, అభ్యుదయ భావజాలాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేశారు. అనువాదాన్ని ఆయన భాషాంతరం కాదని భావాంతరంగా చూసారు. భావ గంభీరతను, భాషా సామర్థ్యాన్ని సమన్వయించుతూ చేసిన ఆయన అనువాదాలు తెలుగులో విశిష్టమైన స్థానం సంపాదించాయి. విమర్శా రచనలలో గోపాలకృష్ణ నిర్మాణాత్మక దృష్టితో, నిశితంగా, వాస్తవతను విశ్లేషించగల శైలితో నిలిచారు. వ్యక్తిగత అభిప్రాయాల కన్నా సామాజిక అవసరాలను ప్రతిబింబించగల రచనలవైపు దృష్టిపెట్టి, సమకాలీన సాహిత్యంపై గంభీరంగా స్పందించారు. ఆయన విమర్శలు సాహిత్యాన్ని తన సామాజిక బాధ్యత గుర్తు చేసుకునేలా చేసేవి. సంపాదకునిగా గోపాలకృష్ణ పాత్ర అసాధారణంగా నిలిచింది. అభ్యుదయ రచయితలకు ప్రోత్సాహం ఇచ్చి, వారి రచనలకు పత్రికల్లో చోటు కల్పించారు. నూతన రచయితలను తీర్చిదిద్దడంలో ఆయన నైపుణ్యం ప్రత్యేకమైనది. సంపాదకత్వాన్ని కేవలం పేజీల అవరణగా కాక, ప్రజా చైతన్య వేదికగా మలచిన వ్యక్తిగా ఆయన సాహిత్య చరిత్రలో గుర్తింపు పొందారు. సమకాలీన సమస్యలపై మౌలిక విమర్శను మేల్కొల్పే వ్యాసాల ద్వారా పాఠకులలో కొత్త దృక్పథాన్ని పెంపొందించారు. రచయితగా గోపాలకృష్ణను ప్రత్యేకంగా నిలిపే అంశాల్లో ముఖ్యమైనవి – పదజాలంలో స్పష్టత, భావ ప్రకటనలో లోతు, విమర్శలో నిజాయితీ, సంపాదకత్వంలో తాత్త్విక నిబద్ధత. రచనను వృత్తిగా కాక, బాధ్యతగా పరిగణించి, జీవితాన్ని సాహిత్యానికి అంకితం చేసిన అరుదైన ఉదాహరణగా ఆయన నిలిచారు. రెంటాల గోపాలకృష్ణ రచనలు నేటికీ సమకాలీనతను కలిగి ఉన్నాయి. సామాజిక సమస్యలను కేంద్రంగా ఉంచుకుని, మార్పుకు మార్గనిర్దేశం చేసే శక్తిని వాటిలో నిక్షిప్తం చేశారు. ఆయన జీవితమే ఒక ఉద్యమం, రచనలే ఒక సందేశం. భావసాంద్రతతో కూడిన ఆయన రచనలు పాఠకులను కలచి వేస్తాయేమో కానీ, తేలికగా వదిలిపెట్టవు. ఆయన కలం ప్రశ్నించేది – సమాజాన్ని, చట్టాలను, మనవాణ్ని. ఆయన రచనలను చదవడం ద్వారా మనం మనల్ని మళ్ళీ ఆలోచించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. రెంటాల గోపాలకృష్ణ ఒక రచయిత మాత్రమే కాదు – ఒక అభ్యుదయ దృక్కోణం. సాహిత్యాన్ని మార్పు కోసం, మానవీయత కోసం, సమాజపు అణగారిన గొంతుకలకు మద్దతుగా వినిపించిన ఆత్మగాథగా ఆయన రచనలు నిలిచి పోయాయి. తెలుగు సాహిత్యంలో ఆయన ఒక శాశ్వత శిఖరం. ఆయన రచనలను మనం గౌరవించాలి కాదు – అనుసరించాలి. ఎందుకంటే ఆయన కలం భావాలకు మార్గాన్ని చూపినది, సమాజానికి దిక్సూచి అయినది.

## ఆఫ్రికాలో ఉద్యమించిన నల్లసూర్యుడు

దక్షిణ ఆఫ్రికా జాతి వివక్ష వ్యతిరేక పోరాటయోధుడు, న్యాయవాది, ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రేస్ (ఏఎన్సి) నాయకుడు, దాణశీలి, ప్రజాసేవకుడు, ప్రజాస్వామ్యయుతంగా ఏర్పడిన దక్షిణ ఆఫ్రికా ప్రభుత్వంలో తొలి నల్లజాతి దేశాధ్యక్షుడు (1994–99), 27 ఏండ్ల పాటు జైలు జీవితం అనుభవించిన అవిశ్రాంత నల్లజాతి ప్రతినిధి అయిన నెల్సన్ మండేలా పుట్టిన రోజు (18 జూలై 1918) సందర్భంగా ఐరాస చొరవతో ప్రతి ఏట 18 జూలై రోజున "అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినం" లేదా "ఇంటర్నేషనల్ డే ఆఫ్ నెల్సన్ మండేలా"ను పాటించడం 18 జూలై 2010 నుంచి ప్రారంభం అయ్యింది. దక్షిణ ఆఫ్రికాలోని "మ్వోజో" గ్రామంలోని "తెంబూ రాయల్" కుటుంబంలో జన్మించిన మండేలా వంశంలో తొలి విద్యావేత్తగా పోర్ట్హేర్, విట్వాటర్స్రాండ్ యూనివర్సిటీల్లో బిఏ, న్యాయ పట్టాలు పొంది ఉన్నత విద్యావేత్తగా పేరు తెచ్చుకొని, లాయర్లా పని చేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు తన పేరు ముందు నెల్సన్ను చేర్చడంతో నెల్సన్ మండేలా అనే పేరు ఖ్యాతిలోకి వచ్చింది. 1943లో వర్ణవివక్ష వ్యతిరేక పోరాటాలు ప్రారంభించిన మండేలా ఏఎన్సి పార్టీలో చేరి శ్వేతజాతి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలు ప్రారంభించారు. వర్ణ వివక్ష పోరాటంలో చురుకుగా పాల్గొనడంతో అరెస్టు కూడా అయ్యారు. ఇదే క్రమంలో మర్క్సిజం వైపు ఆకర్షితులై దక్షిణ ఆఫ్రికా కమ్యూనిస్టు పార్టీలో చేరి రహస్యంగా ఉద్యమాలు చేశారు. శాంతియుతంగా పోరాటం చేస్తూ "ఉమ్కోంటో వీ స్విజ్వే" అనే తీవ్రవాద సంస్థను స్థాపించారు. నాటి శ్వేత జాతి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తూ, 12 జూన్ 1963 రోజున యావజ్జీవ కారాగార శిక్షను విధించడంతో 27 ఏండ్ల పాటు సుదీర్ఘ జైలు జీవితం అనుభవిస్తూ అంతర్జాతీయ మానవాళి దృష్టిని ఆకర్షించారు. జాతీయ, అంతర్జాతీయ ఒత్తిడులకు లొంగిన నాటి ప్రభుత్వం 11 ఫిబ్రవరి 1990న విడుదల చేసింది. జైలులో 466 గదిలో బంధించబడి 63 (1963)లో విడుదల కావడంతో 46663ని మండేలా సంఖ్యగా పిలవబడం జరుగుతోంది. విడుదల అనంతరం నాటి శ్వేతజాతి ప్రభుత్వంతో జరిపిన చర్చల ఫలితంగా 1994లో నిర్వహించిన ఎన్నికల్లో ఏఎన్సి పార్టీ నేతృత్వంలో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వంలో నల్లజాతికి చెందిన తొలి అధ్యక్షుడిగా సేవలు అందించారు. వర్ణ వివక్షను రూపుమాపే కొత్త రాజ్యాంగాన్ని రూపొందించారు. భూసంస్కరణలు, పేదరిక నిర్మూలన, స్వపరిపాలనలకు పట్టం కట్టిన మండేలా నల్లజాతి ఉద్ధారకుడిగా చరిత్రలో నిలిచిపోయారు.

# ఐఐటి,బొంబాయి నుండి ఓపెన్-సోర్స్ సాఫ్ట్‌వేర్ ఫర్ ఎడ్యుకేషన్ కేటగిరిలో ఉత్తమ విశ్వవిద్యాలయం అవార్డు అందుకున్న తెలంగాణ ఉద్యాన వర్సిటీ




**రాజేంద్రనగర్,జులై17(సూర్యరేఖ)**తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఐఐటి, బొంబాయి నుండి ఓపెన్-సోర్స్ సాఫ్ట్‌వేర్ ఫర్ ఎడ్యుకేషన్ (ఫోస్సీ-జిఐఎస్) ప్రాజెక్ట్,ఐఐటి ముంబై నుండి ఉత్తమ విశ్వవిద్యాలయం అవార్డు అందుకుంది. జియోస్పేషియల్ చొరవలు,క్రియాశీల భాగస్వామ్యం గురించి అవగాహన కల్పించడంలో ఆదర్శ ప్రాయమైన మద్దతును గుర్తించి ఉత్తమ విశ్వవిద్యాలయ అవార్డును ఐఐటి ముంబై తెలంగాణ ఉద్యాన వర్సిటీకి అందించింది.భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ,ఐసిటి ద్వారా విద్యపై జాతీయ మిషన్ (ఎన్ఎంఈఐసీటీ) ఆధ్వర్యంలో ఫోస్సీ ప్రాజెక్ట్ యొక్క చొరవ అయిన నేషనల్ జియోస్పేషియల్ అవార్డ్స్ 2025 (ఎడిషన్ 02)లో భాగంగా ఈ అవార్డు అందింది.ఈ అవార్డును 17-7-25న ఐఐటీ బాంబేలో జరిగిన ఓపెన్-సోర్స్ జిఐఎస్ దినోత్సవ వేడుకలు,నేషనల్ జియోస్పేషియల్ అవార్డు 2025లో స్కల్ను వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి.రాజిరెడ్డి అందుకున్నారు.ఈ అవార్డును ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) మాజీ చైర్మన్ శ్రీకిరణ్ కుమార్ అందజేశారు.ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యాన వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి.రాజిరెడ్డి మాట్లాడుతూ... ఉద్యాన రంగంలో భౌగోళిక సమాచార వ్యవస్థ, జిఐఎస్ మ్యాపింగ్ ప్రాముఖ్యతను తెలంగాణలో ఉద్యాన రంగానికి పరిష్కారాన్ని అందించడంలో ఈ విధానం ఉపయోగపడుతుందని అన్నారు.ఇప్పటికే ఉద్యాన తోటలను మ్యాపింగ్ చేయడం,తెలంగాణ ఉద్యాన రంగంలో జిఐఎస్ అప్లికేషన్లను ముమ్మరం చేసి రైతులకు సాగును లాభసాటిగా మార్చేందుకు ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు.తొందర్లోనే విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జిఐఎస్ హ్యాకథాన్‌ను కూడా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.భగవాన్, కన్సల్టెంట్ డాక్టర్ కె.వీరాంజనేయులు,తదితరులు పాల్గొన్నారు. అలాగే ఫోస్సీ ప్రతిష్టాత్మకమైన ఎక్సలెన్స్ ఇన్ ఔట్‌రీచ్ అవార్డును స్కల్ను కన్సల్టెంట్ డాక్టర్ కె.వీరాంజనేయులుకు అందించారు. ఫోస్సీకి అందించిన నిరంతర సహాయ సహకారానికి గుర్తింపుగా ఈ అవార్డును ఐఐటి ముంబై ప్రదానం చేసింది.

# జిహెచ్ఎంసి పారుశుద్ధ్య సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరాల కిట్లను పంపిణీ




ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్,జూలై17(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గంలోని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో జిహెచ్ఎంసి పారిశుధ్య సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరాల కిట్లను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్, డి.ఈ.చందన,లతో కలిసి పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పారిశుద్ధ్య సిబ్బంది సేవలు అభినందనీయమని, వారు చేసే సేవకు ఎంత పారితోషికం ఇచ్చిన తక్కువే అని శానిటేషన్ సిబ్బంది ఒక్కరోజు లేకున్న హైదరాబాద్ హస్త వ్యస్తం అవుతుందని వారితో ప్రతి ఒక్కరు కూడా గౌరవంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# శానిటేషన్ సిబ్బందికి ఆరోగ్య రక్షణ కిట్టు పంపిణీ చేసిన కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి




**ఉప్పల్,జూలై17 (సూర్యరేఖ)** ఉప్పల్ డివిజన్లో జిహెచ్ఎంసి శానిటేషన్ సిబ్బందికి స్థానిక కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి రక్షణ కిట్టు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులను నియంత్రణకు చేసే సేవలు మరువలేనివని రక్షణ కిట్లు రెగ్యులర్ గా వినియోగించుకొని విధులు నిర్వహించేటప్పుడు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.డివిజన్లో ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా సక్రమంగా పనులు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డి.ఈ.చందన,డివిజన్ అధ్యక్షుడు బాకారంలక్ష్మణ్ ఈగా ఆంజనేయులు ముదిరాజ్, తుమ్మల దేవిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లింగంపల్లి రామకృష్ణ, అలుగుల అనిల్ అల్వాల్ భాస్కర్,విజయ్,బొడిగె మల్లేష్ మోహన్ ఇతరులు పాల్గొన్నారు.

## జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కలిసిన కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు

**ఉప్పల్, జూలై 17 (సూర్యరేఖ)** రామంతపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు గురువారం హెచ్ఎండబ్ల్యూఎస్ (జలమండలి )ఎండీ అశోక్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఇటీవల కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిని కలిసిన కార్పొరేటర్,రామంతపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో 30 సంవత్సరాల క్రితం నిర్మించిన పాత సివరేజ్ లైన్ మార్పిడి, సాబేరకాలనీ,కుర్మానగర్,శ్రీనగర్ కాలనీ హనుమాన్ టెంపుల్ ప్రాంతాల్లో కొత్త సివరేజ్ లైన్ ఏర్పాటుకు సంబంధించిన సమస్యలను వివరంగా వివరించారు.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించి,తక్షణమే అవసరమైన ఎస్టిమేషన్లు తయారుచేయాలని అధికారులను ఆదేశించారు.తాను తన నిధుల నుండి పనులు చేపట్టేందుకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం ఈ మేరకు అధికారిక లేఖను ఎస్ఎండీ అశోక్ రెడ్డికి అందజేశారు.లేఖను తీసుకున్న అశోక్ రెడ్డి సంబంధిత పరిలకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని కార్పొరేటర్ కు హామీ ఇచ్చారు.



## ప్రాథమిక పాఠశాలకు నీటి ప్యూరిఫైర్ అందించిన అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు పొన్నాల సంధ్య




**కామారెడ్డి,జూలై17(సూర్యరేఖ)** కామారెడ్డి మున్సిపల్.పరిధిలో సారంపల్లి ప్రాథమిక పాఠశాలకు అమ్మ ఆదర్శకమిటి అధ్యక్షురాలు పొన్నాల సంధ్య మాట్లాడుతూ...ఇటీవల పాఠశాలలో బోరు వేయించిన సందర్భంగా పిల్లలు మినరల్ వాటర్ తాగాలని ఉద్దేశ్యంతో పిల్లలకు ప్యూరిఫైర్ ఇప్పించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు అనిల్ మాజీ కౌన్సిలర్ రవి కుమార్,మాజీ సర్పంచ్ గంగాధర్,సొసైటీ డైరెక్టర్ రాజు,గ్రామస్తులు శ్రీనివాస్, రాజారాం శ్రీను,దశరథ్,అనిల్,నవీన్,తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాదులో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ని సన్మానించిన

బెల్లంపల్లి మాదిగ హక్కుల దండోరా నాయకులు



**బెల్లంపల్లి,జులై17(సూర్యరేఖ)** మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ని సన్మానించేందుకు బెల్లంపల్లి నియోజకవర్గం నుండి ఎన్ హెచ్ డి రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగ,కాంపెల్లి రాజం మాదిగ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో హైదరాబాద్ కి తరలివెళ్లి అడ్లూరి లక్ష్మణ్ ని సన్మానించారు.సభను ఉద్దేశించి లక్ష్మణ్ మాట్లాడుతూ. మాదిగలను మాది ఉపకులాలను తన సొంత కుటుంబంగా భావించి ప్రతి ఒక్కరికి మేలు జరిగేలా చట్టపరంగా పాలన కొనసాగిస్తానని తెలిపారు.నాకు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని ప్రతి పేదవాడి ఆకలి తీర్చే మెతుకునవుతానని తెలియజేశారు.ఈ సన్మానంతో నాకు మరింత బాధ్యత పెరిగిందని మాదిగ హక్కుల దండోరాకు తన వంతు తోడ్పాటు అందిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ యంగ్ డైనమిక్ లేడీ టైగర్ గద్దల హైమావతి మాదిగ,బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు కాంపెల్లి సతీష్ మాదిగ,ప్రధాన కార్యదర్శి గద్దల కుమారస్వామి మాదిగ,ఎక్స్ కౌన్సిలర్ సీనియర్ నాయకులు లింగంపల్లి రాములు మాదిగ, ఉపాధ్యక్షులు సిరికొండ మహేందర్ మాదిగ, తదితరులు ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసిన బెల్లంపల్లి జడ్జీ ముఖేష్



**బెల్లంపల్లి,జూలై17 (సూర్యరేఖ)** బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాల గురువారం బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి ముఖేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడంతో పాటు చదువు ఎలా సాగుతుందో పరిశీలించారు.చదువుతోపాటు,చట్టాలపై అవగాహన విద్యార్థులకు అవసరమని ఈ సందర్భంగా వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు శివకుమార్,జనరల్ సెక్రటరీ చేను రవికుమార్,అశోక్ బాలు,మనోహర్, శ్రీనివాస్,సంగీత లావణ్య,ఉమా,మమతా, న్యాయవాదులు,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బిజెపి సీనియర్ నేత కొల్లు బాల్ రాజ్ జన్మదిన వేడుకలు







**విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు, పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం**

**ఉప్పల్,జూలై17(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు కొల్లు బాల్ రాజ్ కురుమ జన్మదినాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలను నిర్వహించి సేవ సౌభ్రాతృత్వాన్ని చాటుకున్నారు. ఉప్పల్ జిల్లా పరిషత్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న పిల్లలకు ఉచ్చిత కంటి పరీక్షలు నిర్వహించి,కళ్లద్దాలు అందజేయడం జరిగింది. పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని కుటుంబ సమేతంగా పారిశుధ్య కార్మికులను సత్కరించారు. ఈ సందర్భంగా కొల్లు బాలరాజ్ కురుమ మాట్లాడుతూ...పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. ఆరోగ్య, పారిశుద్య పరిరక్షణలో నిత్యం సేవలు అందిస్తున్నారని పారిశుధ్య కార్మికులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని వారి అభివృద్ధికి సహకరించాలన్నారు. శ్రీసరస్వతి శిశు మందిర్ -విద్యార్థులతో వారి జన్మదిన వేడుకలు జరుపుకోవటం జరిగింది.విలువలతో కూడిన విద్యని అందిస్తూ విద్యార్థులలో దేశభక్తి దైవభక్తిని నింపే గొప్ప ప్రయత్నాన్ని చేస్తున్న ఉపాధ్యాయుల విశేషమైన సేవలను కొనియాడారు.

# డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడిన టమాటాల లారీ





**రాజేంద్రనగర్,జులై17(సూర్యరేఖ)** డివైడర్ ను ఢీకొట్టి బోల్తా కొట్టిన సంఘటన సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్లో ఇన్నర్ రింగ్ రోడ్డు డైరీ ఫార్మ్ చౌరస్తా రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం. శంషాబాద్ నుంచి గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌కు వెళ్తున్న సమయంలో లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా కొట్టింది. లారీ బోల్తా కొట్టడంతో అందులో ఉన్న టమాటాలు, ట్రేలు మొత్తం రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి.పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ డైరీ ఫామ్ చౌరస్తా వద్ద ఈ ప్రమాదం జరిగింది.అయితే టమాటాల లోడ్‌తో వెళ్తున్న రైతులు ఎవరికీ ఏ ప్రమాదం జరగకపోవడం విశేషం.కాగా,ఈ ఘటనతో రహదారిపై చాలాసేపటి వరకు ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ఘటనస్థలికి చేరుకున్న పోలీసులు క్రేన్ సాయంతో లారీని పక్కకు తీశారు.అనంతరం రోడ్డుపై చెల్ల చెదురైన టమాటాలు,ట్రేలను జిహెచ్ఎంసి సిబ్బందితో తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

# పంజా విజయ్ కుమార్ పై విమర్శలు చేసిన వారు ఆత్మను విమర్శించుకోవాలి

**పార్టీకి రాజీనామా ఎందుకు చేసాడో అడిగే బాధ్యత మీది కాదా.?**
**పార్టీ కోసం ఆయన సాఫ్ట్వేర్ జాబ్ ను వదులుకుంది నిజం కాదా.?**
**పంజా విజయ్ కుమార్ పై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదు..**
**పంజా బాబు...**



**నిజాంపేట,జూలై17(సూర్యరేఖ)** బీసీలకు బిజెపి పార్టీ వల్ల నష్టం చేకూరుతుందనే ఉద్దేశంతోనే భారతీయ జనతా పార్టీకి తన రాజీనామా పంపించడం జరిగింది.బిజెపి పార్టీలో కార్యకర్తను కాపాడుకునే ఉద్దేశం ఉంటే బుజ్జగింపులు జరగాలి కానీ పొమ్మనలేక పొగ పెట్టినట్లుగా నిజాంపేట మండల బిజెపి నాయకులు వ్యవహరిస్తున్నారని పంజా బాబు ఆరోపించారు.గతంలో బీ ఆర్ఎస్ పార్టీలో జెడ్పిటిసి గా పనిచేసిన పంజా విజయ్ కుమార్ మండలంలో బిజెపి పార్టీ కార్యకర్తలు నాయకులు ఉండేవారు కాదని అతను బీ ఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి అతని సాఫ్ట్వేర్ జాబ్ ను వదులుకొని బిజెపి పార్టీలో చేరిన తర్వాతనే మండలంలో కార్యకర్తలను మమైకం చేసి బిజెపి పార్టీలో పూర్వ వైభవం తీసుకొచ్చిన వాస్తవం నిజం కాదా? మొన్న జరిగిన ఎమ్మెల్యే,ఎంపీ ఎలక్షన్లలో పార్టీకి ఫుల్ టైం వర్క్ చేయడం వల్లనే పార్టీకి గుర్తింపు లభించింది నిజం కాదా బిజెపి నాయకులకు సూటిగా ప్రశ్నించారు.ఎంపీ ఎలక్షన్లలో ఆయన పార్టీకి చేసిన సేవతోనే ఎంపీ రఘునందన్ రావు గెలుపొందింది నిజం కాదా? బీసీలకు అన్యాయం జరుగుతుందని పార్టీకి రాజీనామా చేస్తే అది ఆలోచించకుండా కొందరు బిజెపి నాయకులు పంజా విజయ్ కుమార్ పై విమర్శలు చేయడం సిగ్గుచేటుగా ఉందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా విజయ్ కుమార్ పోటీ చేసినప్పుడు ఆయన కార్యకర్తలకు డబ్బులు పంచమని చెబితే డబ్బులను దాచుకున్నది మీరు కాదా అని ప్రశ్నించారు.బిజెపి పార్టీలో విజయ్ చేరిన తర్వాతనే నిజాంపేట మండలంలో కొందరు స్వార్ధ పూరిత నాయకులు ఆయనను వాడుకొని నాపై విమర్శలు గుప్పించడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఇకనైనా నాయకులారా గమనించాలి గతంలో పార్టీకి సేవలు అందించిన వ్యక్తి ఎందుకు పార్టీని వీడుతున్నాడో తెలుసుకోవాలి, కానీ పార్టీని వీడినంత మాత్రాన ఒరిగేది లేదని అనడం మీ లాగా ఎవరు డబ్బులు ఇస్తారు.ఎవరు ఏమి తినిపిస్తారని ఆశపడే వ్యక్తి కాదని పంజా విజయ్ కుమార్,ఎక్కడ ఉన్నా ఆయనను అభిమానించే వారిని అతనిని నమ్ముకున్న వారికి ఎలాంటి ద్రోహం చెయ్యరని మెదక్ నియోజకవర్గంలో బిజెపి పార్టీ ఉందా లేదా అనే పరిస్థితిలో పార్టీకి అండగా ఉంటూ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేసిన లాభం లేకుండా పోయిందన్నారు.బిజెపి పార్టీలో ఉన్న కొందరి స్వార్ధపర రాజకీయ నాయకుల వల్ల బిజెపి పార్టీకి ఏనాడు న్యాయం చేకూరదని పార్టీని నాశనం చేసేవారు ఎక్కువయ్యారని ఆయన ఆరోపించారు.

## హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌కు తెలంగాణ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా ఎల్ సింహాద్రి బాబు నియామకం..



**హైదరాబాద్,జూలై 17 (సూర్యరేఖ)** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్న హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా ఎల్.సింహాద్రి బాబు నియమించినట్టు సంస్థ చైర్మన్ మాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు ఎల్. సింహాద్రి బాబు సంస్థలో ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ గా నియమితులైన సింహాద్రి బాబు మాట్లాడుతూ...మా మీద నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన చైర్మన్ మాధవ్, మా నియామకానికి కృషి చేసిన జాతీయ ప్రధాన కార్యదర్శి సతీష్ దేవరకొండకి కృతజ్ఞతలు తెలియజేశారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం మా శక్తి మేరకు పనిచేస్తానని బాధితులకు అండగా నిలిచి,న్యాయం జరిగేలా నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.“సంస్థ అభివృద్ధికి సద్వ్యవస్థాపకతతో పని చేస్తానని,హక్కులు భంగమవుతున్న ప్రతిసారి హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తరపున గట్టిగా స్పందిస్తామని,నన్ను నియమించడం సామాజిక బాధ్యతను మరింత పెంచినట్లుందని వారు అన్నారు.ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు స్థానిక ప్రముఖులు,సామాజిక కార్యకర్తలు,నూతనంగా నియమితులైన ఎగ్జిక్యూటివ్ మెంబర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఉప్పల్ డిసికి శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్ బండాల గీతాప్రవీణ్



**ఉప్పల్,జూలై17(సూర్యరేఖ)** ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ కమిషనర్ రాజును చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## నాచారం డివిజన్ అభివృద్ధికి నిధుల మంజూరు..

**రూ.30లక్షలతో చేపట్టనున్న పనులు**



**ఉప్పల్,జూలై17 (సూర్యరేఖ)**నాచారం డివిజన్‌కు నిధులు మంజూరు అయ్యాయి. నాచారం డివిజన్‌లోని కార్తికేయనగర్ కాలనీలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు రూ.33 లక్షల నిధులను ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి మంజూరు చేయించారు.ఈ నిధులతో త్వరలోనే అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. డివిజన్‌కు నిధులను మంజూరుకు సహకరించిన పరమేశ్వర్‌రెడ్డికి కాలనీ వాసులు. ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.నాచారం డివిజన్‌లోని శుభం క్లాసిక్ అపార్టుమెంట్,కార్తికేయనగర్ లో సీసీ రోడ్ నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు అయ్యాయి. కార్తికేయనగర్ కాలనీలవాసులకు నిధుల మంజూరుకు సంబంధించిన పత్రాలను పరమేశ్వర్‌రెడ్డి అందచేశారు.ఈ కార్యక్రమంలో నాచారం కాంగ్రెస్ నాయకులు సంతోష్ రెడ్డి,ఎల్ వీ రావు రిత్విక్ శర్మ,దివ్య కాంచ,శామ్ సుందర్,వీర రెడ్డి,ఎల్ వి.ప్రసాద్ శాస్త్రి కనకయ్య శరత్,ప్రమిత్,కిషోర్,రమణ,తదితరులు పాల్గొన్నారు.

## బచ్చురాజ్ పల్లిలో రైతుల రుణమాఫీ జాబితా విడుదల.



**నిజాంపేట,జూలై17 (సూర్యరేఖ)** మండల పరిదిలోని బచ్చురాజపల్లి గ్రామంలో రైతుల రుణమాఫీ జాబితా విడుదల చేయడం జరిగింది. గ్రామంలో 293 రైతులకు గాను 2,35,21,910 రుణమాఫీ జరిగినట్లు మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి రమ్య తెలిపారు.రుణమాఫీ అయిన రైతుల జాబితా ఫ్లెక్సీలతో గ్రామపంచాయతీ వద్ద అతికించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు వినోద్ నాయక్ గ్రామ అధ్యక్షులు స్వామి,లింగం,ఆంజనేయులు, రామచంద్రం ఉపేందర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# రానున్న స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ విజయం తథ్యం




**మెదక్ తరలిన కాంగ్రెస్ శ్రేణులు..**

**నిజాంపేట,జూలై17(సూర్యరేఖ)** కాంగ్రెస్ పార్టీ చేస్తున్నటువంటి అభివృద్ధి పనులకు ఆకర్షితులై మెదక్ శాసన సభ్యులు మైనంపల్లి రోహిత్ రావు,మైనంపల్లి హనుమంతరావు,ల ఆధ్వర్యంలో జడ్ చెరువు తాండ గ్రామానికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ మోహన్ నాయక్ తోపాటు సుమారు 200 మంది వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు టీపిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్,మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు.ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నిజాంపేట మండల కేంద్రం నుండి కాంగ్రెస్ కార్యకర్తలునాయకులు సుమారు వెయ్యి మందికి పైగా మెదక్ బయలుదేరుతున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ సమయంలోనే ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. రేవంత్ రెడ్డి చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మెదక్ నియోజకవర్గాన్ని మైనంపల్లి రోహిత్ రావు అభివృద్ధి బాటలో నడిపిస్తున్నందున వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని రానున్న స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చెరుకు శ్రీనివాస్ రెడ్డి తాజా మాజీ ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు,తాజా మాజీ సర్పంచ్ అధ్యక్షులు అమరసేనారెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులుపంజా మహేందర్ నసీరుద్దీన్,జిట్టి మారుతి, మండల అధ్యక్షులు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్,గ్రామ అధ్యక్షుడు కొమ్మటబాబు,వై వెంకటేశం మధుసూదన్ రెడ్డి,నాగరాజు,రవి నాయక్ బన్నీ శ్రీశైలం అబ్బరెడ్డి బాలయ్య స్వామిగౌడ్ బొమ్మెన శ్రీనివాస్ సామల మహేష్, రాజేందర్ గౌడ్, గుమ్ముల అజయ్ శ్రీనివాస్,రంగ రమేష్,తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ కు శుభాకాంక్షలు తెలిపిన బిజెపి నేతలు




**ఉప్పల్,జూలై17 (సూర్యరేఖ)** ఉప్పల్ సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ గా వచ్చిన జి.రాజుని మర్యాదపూర్వకంగా ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో బీజేపీ ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్,నాయకులు కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ని ఉప్పల్ సర్కిల్ లో అనేక సమస్యలు ఉన్నాయని వాటిపైన ప్రత్యేక దృష్టి సారించాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్వంచ విట్టల్,సంఘీ స్వామి యాదవ్,తిరుపతి సత్యనారాయణ దర్గ కృష్ణ,కావూరి వాసు కార్తీక్ యాదవ్ జెర్రిపోతుల కిషన్ ముత్యాల కృష్ణరెడ్డి, కొంగరి రామచందర్, ఎండీ. అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి




**భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్**

**రాజేంద్రనగర్,జులై17(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ లో అభివృద్ధి పనులలో నాణ్యతకు ప్రాధాన్యత ఇచ్చేలా తమ వంతుగా పర్యవేక్షణలు నిర్వహిస్తున్నామని భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు.రాజేంద్రనగర్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం ముందు నూతనంగా మంజూరు అయిన రూ.7.50 లక్షల సీసీ రోడ్డు పనులు పర్యవేక్షించడానికి వచ్చిన డిఈ రామచంద్ర రాజు,ఏఈ వేణుగోపాల్,వర్క్ ఇన్స్పెక్టర్ ఆనంద్,లతో పాటు గత అనేక సంవత్సరాల నుంచి అధికారులతో ఎస్టిమేషన్ వేయించి మంజూరు చేయించారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ మాజీ అధ్యక్షులు గుంజి బాబురావు డివిజన్ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఈ.వేణుగోపాల్ అరుణ్ కుమార్ రాజు భయ్యా నరసింహ రఘుమారెడ్డి కాంట్రాక్టర్ ఆబేద్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 27 చలో గాంధారి

**గణేష్ నాయక్.**

**కామారెడ్డి,జూలై 17(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆర్ బి గెస్ట్ హౌస్ లో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాణా ప్రతాప్ రాథోడ్ జిల్లా అధ్యక్షులు నునావత్ గణేష్ నాయక్ మాట్లాడుతూ...కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలో గిరిజన గర్జన సభ పెట్టాలని నిర్ణయించారు. ఈనెల 27 వ తేదీ ఆదివారం మారుతి ఫంక్షన్ హాల్ లో సభ నిర్వహించబడుతుంది.ఈ సదస్సుకు ముఖ్యఅతులుగా డిప్యూటీ స్పీకర్ రామచందర్ నాయక్,గిరిజన కార్పోరేషన్ చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్,ఎమ్మెల్సీ శంకర్ నాయక్,లు హాజరవుతారు.ఈ సభ యొక్క ముఖ్య ఉద్దేశం ధర్మ సమాజ్ పరిరక్షణ,పోడు భూములు అసైన్మెంట్ భూములపై అవగాహన కల్పించుట,గిరిజన సమస్యలపై రాజ్యాంగంలో 8 షెడ్యూల్లో గోరు బోలి భాషను చేర్చాలని భారీ సదస్సు



నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రి నాయక్. గౌరవ అధ్యక్షులు రూప్ సింగ్ నాయక్,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్,నాయకులు ప్రేమ్,ప్రకాష్ నాయక్ విజయ్ రవీందర శ్రీనునాయక్,పీర్ సింగ్ నాయక్,పరశురాం బన్సీలాల్ నాయక్,దేవి సింగ్, మోహన్,గోపి నాయక్,వసంత్ పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం..



**రామాయంపేట,జూలై17 (సూర్యరేఖ)** మెదక్ జిల్లా రామాయంపేట మండలం వెంకటాపూర్ ఆర్ గ్రామానికి చెందిన బండారి భూమయ్య (58) గత కొద్ది కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ బుధవారం మరణించాడు.ఈ విషయం గ్రామస్తులు ద్వారా తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు వెంకుగారి రాజిరెడ్డి మృతుడి కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో బండారి గంగులు ముచ్చర్ల బాలరాజు, కొమ్మ గళ్ళ దావీదు,పూర్ర స్వామి,బండారి రవి, కొమ్మగళ్ళ స్వామి,బండారి శ్రీను,తదితరులు పాల్గొన్నారు

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి



**రామాయంపేట,జూలై 17(సూర్యరేఖ)** మెదక్ జిల్లా రామయంపేట్ పట్టణాన 6వ వార్డుకి చెందిన కోనాపురం రాములు ప్రమాదవశాత్తు మృతి చెందాడు.ఈ విషయం స్థానిక నాయకులద్వారా తెలిసున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు,మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి స్థానిక నాయకుల ద్వారా రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమం లో చింతల రాములు,మద్దూరి భానుచందర్,రాజు,యాదగిరి, మల్లేశం రాము,నరేష్ పట్టణ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ జీని కలసిన సతీష్ బిడ్ల



**నాంపల్లి,హైద్రాబాద్,జూలై 17(సూర్యరేఖ)** భారతీయ జనతా పార్టీ అనుబంధ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చ మాజీ అధికార ప్రతినిధి సతీష్ బాడ్ల కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ జీను మర్యాదపూర్వకంగా కలసి అఖిల్ భారతీయ సఫై మజదూర్ సంఘ్ ప్రతినిధి మండలితో సమస్యల పరిస్కారం కోరుతూ వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా సతీష్ బిడ్ల చరవాణిలో మాట్లాడుతూ...న్యూఢిల్లీలో తెలంగాణ మధ్యప్రదేశ్,గుజరాత్, రాజస్థాన్,త్రిపుర,జమ్మూ కశ్మీర్,అసమ్ రాష్ట్రాల నుండి వచ్చిన అఖిల్ భారతీయ సఫై మజదూర్ సంఘ్ ప్రతినిధి మండలి సభ్యుల బృందం కేంద్ర అర్జున్ రామ్ మేఘవాల్ జీని వారి నివాసంలో కలసి శాలువాతో సత్కరించి దేశం లోని వివిధ రాష్ట్రాలలో సఫై కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరిస్తూ వాటిని పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం ఇవ్వడం జరిగిందని,మంత్రి సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు.

## గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి ఘనంగా 7వ పూజ,బోనాలు..



**నాంపల్లి,హైద్రాబాద్, జూలై17(సూర్యరేఖ)** గోల్కొండ కోటలో వెలసిన మహిమాన్విత జగదాంబ మహంకాళీ ఎల్లమ్మ తల్లికి 7వ పూజ బోనాలను దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి వసంత సహకారంతో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ చంటి బాబు పాలక మండలి కమిటీ సభ్యులు గోల్కొండ దేవస్థానం వృత్తి పనివారల సంఘం ప్రతినిధులతో కలసి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ పాలకవర్గ సభ్యులు ఆకుల చంద్రశేఖర్ నాగులపల్లి శ్రీకాంత్, సంతోష్ గౌడ్,ప్రదీప్ కుమార్,సింగ్జోగి యాదగిరి డి.అనిత,తదితరులు పాల్గొన్నారు

# ఐసీఏఆర్ లో 97వ సెర్మని విక్షిత్ కృషి ఎగ్జిబిషన్





**రాజేంద్రనగర్,జులై17(సూర్యరేఖ)** ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్)లో 97వ అవార్డు సెర్మోని విక్షిత్ కృషి ఎగ్జిబిషన్ ను నిర్వహించారు.ఈ సందర్భంగా న్యూ ఢిల్లీలోని భారతరత్న సుబ్రమణ్యం ఆడిటోరియంలో అవార్డు ప్రదానోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హాజరయ్యారు.హైదరాబాద్ నుంచి భారత వరి పరిశోధన సంస్థ నుంచి డైరెక్టర్ టీమ్ అవార్డు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో సారధి ఆర్.ఎం.సుందరం,శాస్త్రవేత్తలు డాక్టర్ సతేంద్ర మంగోత్ర,శ్రీనివాస్ ప్రసాద్,డాక్టర్ జీఎస్ లోహ డాక్టర్ నీరజ,డాక్టర్ పద్మ కుమారి,డాక్టర్ జ్యోతి బద్రి,డాక్టర్ కల్యాణ్,డాక్టర్ పాపారావు అవార్డులను అందుకున్నారు.

## బోనాల పండుగ నిర్వహణపై సమీక్షా సమావేశం

**పాల్గొన్న కార్పొరేటర్లు బన్నాల గీత ప్రవీణ్,కక్కిరేణి చేతన హరీష్,బండారు శ్రీవాణి వెంకట్రావు, మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి**




**ఉప్పల్,జూలై 17(సూర్యరేఖ)** ఉప్పల్ జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో బోనాల సందర్భంగా డిప్యూటీ కమిషనర్ జి.రాజు అధ్యక్షతన గురువారం మున్సిపల్ సమావేశం హాల్ లో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.సమీక్ష సమావేశంలో చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్,హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్,రామంతపూర్ బండారు శ్రీవాణి వెంకట్రావు, ఉప్పల్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్లు అధికారులకు పలు సూచనలు,సలహాలు చేపట్టవలసిన చర్యల గురించి తెలియజేశారు. ఉప్పల్, రామంతపూర్,హబ్సిగూడ, చిలుకానగర్ డివిజన్ల పరిధిలోని అన్ని ఆలయాల వద్ద పారిశుద్ధ్య పనులు వెంటనే నిర్వహించాలని, ఆలయాల వద్ద విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేయాలని రోడ్ల మరమ్మతులు చేయాలని,ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కలగకుండా అన్ని శాఖల అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో ఉప్పల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ జి. నాగరాజు,మున్సిపల్ ఈ.ఈ.వి.హరిలాల్,టౌన్ ప్లానింగ్ ఏసిపి పి కృష్ణమూర్తి,సానిటేషన్ డిప్యూటీ ఈ.ఈ.సిహెచ్ చందన,ఉప్పల్ విద్యుత్ శాఖ ఏ.డి.ఈ. కె.రవీందర్,జలమండలి డీజీఎం రజనీకాంత్ ఎస్ఎఫ్ ఓ.బి.పద్మయ్య,సైనిక్పురి విద్యుత్ శాఖ ఏడిఏ.ఎండి అన్వర్,ఏఈటి శ్రీవాణి లతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రభుత్వ ఫార్మసిస్టుగా అవార్డు అందుకున్న మునగపాటి వందన




**రాజేంద్రనగర్,జులై17(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ ప్రపంచ జనాభ వారోత్సవాలను పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని హసన్ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఫార్మసిస్టుగా పనిచేస్తున్న మునగపాటి వందన రాజేంద్రనగర్ డివిజన్ ఉత్తమ ఫార్మసిస్టుగా అవార్డును అందుకున్నారు. జిల్లాలోని డిజన్లవారీగా వివిధ వైద్య విభాగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది ఉత్తమ పనితీరులో డివిజన్ పరిధిలో ప్రభుత్వ ఫార్మసిస్ట్ మునగపాటి వందన ఉత్తమ పనితీరుతో ఎంపిక కావడం పట్ల ఆ శాఖ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.గురువారం కామినేని హాస్పిటల్లో జరిగిన అవార్డుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు జిల్లా ఉప వైద్య,ఆరోగ్యశాఖ అధికారిని విజయ పూర్ణిమ చేతులమీదుగా ఆమె అవార్డుతోపాటు ప్రశంసా పత్రాన్ని అందుకు న్నారు. ఈ సందర్భంగా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారులు, సిబ్బందితోపాటు మార్కండేయనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నవోదయ యూత్ అసోసియేషన్, సత్యసాయి పాదుపు సంఘం ప్రతినిధులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

## కార్వాన్ దర్బార్ మైసమ్మవారి ఘటంకు భారీగా పూజలు




**నాంపల్లి,హైద్రాబాద్,జూలై17(సూర్యరేఖ)** ఆషాడ మాస బోనాలను పురస్కరించుకుని కార్వాన్ నియోజకవర్గంలో ఆచార వ్యవహారాలు సంస్కృతి సంప్రదాయాలతో కార్వాన్ దర్బార్ మైసమ్మవారి ఘటం పలు పురవీధుల తిరుగుతూ భారీగా భక్తుల సాఖలు,పూజలు అందుకున్నారు.ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ అనుబంధ బీజేవైఎం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శులు కార్వాన్ శివ శంకర క్రాంతి సేవ సమితి అధ్యక్షులు పడాల అనంత కృష్ణ స్వగృహంలో అమ్మవారి ఘటంకు పూజలు నిర్వహించి,హారతులతో స్వాగతం పలికి పడాల దత్తాత్రేయ అమ్మవారి కుటుంబం సభ్యులు ముల్లె బిక్షపతి,ముల్లె నిఖిలేష్, రాజేష్,నవీన్,రాజేందర్ బాబు,చింటూ తదితరులను శాలువాతో సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా పడాల అనంత కృష్ణ మాట్టాడుతూ...రాష్ట్రం హైదరా బాద్ నగరం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరినట్లు చెప్పారు.అమ్మవారి కరుణకటాక్షంతో నగరం మరింత అభివృద్ధి చెందాలని ఆశిస్తున్నట్లు చెప్పారు.

## పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కిట్లు పంపిణీ చేసిన కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్



**ఉప్పల్,జూలై17 (సూర్యరేఖ)** హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేని చేతన హరీష్ డివిజన్ కార్యాలయంలో జిహెచ్ఎంసి కార్మికులకు కిట్స్ (గ్లౌజులు మాస్కులు,సబ్బులు,)వ్యక్తిగత సామాన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... జిహెచ్ఎంసి సిబ్బంది ప్రతిరోజూ తప్పకుండా విధులకు హాజరు కావాలని సూచించారు. కార్మికులు విధులతో పాటు వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. విధుల్లో పాల్గొనేటప్పుడు చేతులకు గ్లౌజులు,మాస్కులు,వేసుకొని విధుల్లో పాల్గొన్నాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బిజెపి మహిళా మోర్చా నాయకురాలు కొండేరు స్రవంతి, జిహెచ్ఎంసి డి.ఈ.సిహెచ్. చందన, జవాన్లు మారయ్య,నర్సింగ్,పారిశుధ్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్దలతో బోనాల ఉత్సవాలు జరుపుకోవాలి..

**గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు దేవర వంశీ**



**నాంపల్లి,హైద్రాబాద్,జూలై17(సూర్యరేఖ)** ఆషాడ మాస బోనాలను పురస్కరించుకుని గోషామహెల్ నియోజకవర్గంలో జరిగిన బోనాలు వేడుకల్లో ఆర్యన్ యూత్ అస్సోసియేషన్ సభ్యుల బృందం ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై భారతీయ జనతా పార్టీ సెంట్రల్ జోన్ నాంపల్లి నియోజకవర్గం గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు దేవర వంశీని సాదరంగా ఆహ్వానించి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భముగా దేవర వంశీ మాట్లాడుతూ..తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకైన బోనాల పండగను ఆనందోత్సాహాల మధ్య భక్తిశ్రద్దలతో అమ్మవార్ల బోనాల ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని అన్నారు.


## భవనంపై నుంచి పడి సెంట్రింగ్ కార్మికుడు మృతి..



**రాజేంద్రనగర్,జులై17 (సూర్యరేఖ)** నిర్మాణ పనుల్లో ఉన్న ఓ కార్మికుడు భవనంపై నుంచి కింద పడి మృతి చెందాడు.ఈ ఘటన మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. నవాబుంటకు చెందిన మహ్మద్ నవాజ్ (28) భార్య, నలుగురు సంతానం శాస్త్రీపురంలోని ఓ అపార్ట్మెంట్లో గత కొన్ని రోజులుగా సెంట్రింగ్ పని చేస్తున్నాడు. గురువారం ఉదయం 6వ అంతస్తులో సెంట్రింగ్ పనులను చేస్తున్నారు. ప్రమాదవశాత్తు మహ్మద్ నవాజ్ కిందపడి తీవ్ర గాయాలకు గురైయ్యాడు. కార్మికులు వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. విషయాన్ని పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఈనెల 21న హరిహర వీరమల్లు ప్రీ రిలీజ్ ఈవెంట్

**గుండా సంతోష్ నేత**



**కామారెడ్డి,జూలై17(సూర్య రేఖ)** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు ప్రీ రిలీజ్ ఈవెంట్ ఈ నెల 21న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ శిల్పకళా వేదికలో చిత్ర బృందం నిర్వహిస్తున్నట్లు పవన్ కళ్యాణ్ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షులు, నిజామాబాద్ జనసేన పార్టీ జిల్లా ఇన్చార్జి గుండా సంతోష్ నేత ఓ ప్రకటనలో తెలిపారు.విశాఖపట్నంలో జరగాల్సిన హరిహర వీరమల్లు ప్రీ రిలీజ్ ఫంక్షన్ హైదరాబాద్ కు మార్పు చేయడం జరిగిందని,కావున అభిమానులు అర్థం చేసుకొని,ఈ నెల 21న శిల్పకళా వేదిక రావాలని ఆయన అభిమానులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దర్శకధీరుడు రాజమౌళి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి కాన్వాయ్ తో బయలుదేరి వెళ్లాలని ఆయన సూచించారు.

# అదనపు కలెక్టర్ ను సన్మానించిన టీఎన్జీవో నాయకులు




**మంచిర్యాల,జులై 17(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు చేపట్టిన పి.చంద్రయ్య,అలాగే జిల్లా వ్యవసాయ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన భూక్యా ఛత్రునాయక్,లను టీఎన్జీవో నాయకులు ఘనంగా సన్మానించారు.వికారాబాద్ జిల్లా కేంద్రంలో విధులు నిర్వహించి బదిలీపై వచ్చిన మంచిర్యాల అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య ను, అలాగే కరీంనగర్ జిల్లా నుండి బదిలీపై మంచిర్యాల జిల్లాకు వచ్చిన జిల్లా వ్యవసాయ అధికారి భూక్యా ఛత్రునాయక్,లను గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ సముదాయభవన్ లో టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో అధికారులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్చం అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య మాట్లాడుతూ. జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని,పాలన యంత్రాంగానికి అవసరమైన సేవలు అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాం కుమార్ తిరుపతి,సంయుక్త కార్యదర్శి సునీత, మంచిర్యాల యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు గోపాల్, అజయ్ సూపరింటెండెంట్,లు వసంత కుమార్, గంగారం సభ్యులు కార్తీక్,అజయ్,వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధే ప్రధాన ఎజెండా




ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

**శంషాబాద్,జులై17(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధే ప్రధాన ఎజెండాగా పని చేస్తానని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్ తెలిపారు. గురువారం స్థానిక ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ప్రభుత్వం,సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ నిధుల సౌజన్యంతో రెండు కీలకమైన అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.అందులో భాగంగా నిర్వహించిన ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్,షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఈ రోడ్ల నిర్మాణం వలన ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఎన్.హెచ్ 44 నుండి



అల్లికొల్ తండా వయా మదనపల్లి వరకు సుమారు 3 కోట్ల 40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించబడుతుందన్నారు.ఈ రోడ్డు అల్లికొల్ తండా మదనపల్లి గ్రామాల ప్రజలకు జాతీయ రహదారితో మెరుగైన అనుసంధానాన్ని కల్పిస్తుందన్నారు.రూ.8 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అప్రోచ్ రోడ్డు పిల్లోనిగూడ నుండి తిమ్మాపూర్ రైల్వే గేట్,ముక్తగూడ మీదుగా నానాజీపూర్ వరకు విస్తరించి ఉంటుందన్నారు.ఈ రోడ్డు ముఖ్యంగా పిల్లోనిగూడ,తిమ్మాపూర్ ముక్తగూడ,నానాజీపూర్ గ్రామాలకు రవాణా సౌకర్యాలను గణనీయంగా మెరుగుపరుస్తుందని అన్నారు.ఈ రెండు రోడ్ల నిర్మాణం వలన ఆయా గ్రామాల ప్రజలకు ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడానికి విద్యార్థులు పాఠశాలలు/కళాశాలలకు చేరుకోవడానికి అత్యవసర సేవలకు వేగంగా అందుబాటులో ఉండటానికి ఎంతగానో సహాయపడుతుందన్నారు.స్థానిక ప్రజల చిరకాల కోరిక అయిన ఈ రోడ్ల నిర్మాణం త్వరలో ప్రారంభించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

# ఐదు బంగారు పతకాలు సాధించడం కామారెడ్డి జిల్లాకే గర్వ కారణం

వి.విశ్వనాథం సెక్రటరీ కర్షక్ బి.ఎడ్ కళాశాల..

**కామారెడ్డి,జూలై 17(సూర్యరేఖ)** తెలంగాణ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రెండవ స్నాతకోత్సవంలో కామారెడ్డి కర్షక్ బి.ఎడ్ కళాశాల విద్యార్థులకు వరుసగా ఐదు విద్యా సంవత్సరాలకు 2017ది2021 బి.ఎడ్ విభాగంలో టాపర్లుగా నిలిచి బంగారు పథకాలు సాధించడం జరిగింది,రాష్ట్ర చరిత్రలోనే ఏ యూనివర్సిటీలో కూడా ఐదు సంవత్సరాలు వరుసగా ఒకే కళాశాలకు ఇప్పటివరకు బంగారు పథకాలు రాలేదని,ఆ ఘనతను సాధించిన ఏకైక కళాశాలగా కర్షక్ బి.ఎడ్ కళాశాల నిలిచిందని అన్నారు.వీరికి గౌరవ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బంగారు పథకాలను అందజేయడం జరిగింది,దీనిని పురస్కరించుకొని నేడు కళాశాలలో బంగారు పతక విజేతలను ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ వి.విశ్వనాథం మాట్లాడుతూ బి.ఎడ్ విభాగంలో విశ్వవిద్యాలయ పరిధిలో అత్యుత్తమ ప్రతిభను కనబరచడమే కాకుండా వరుస సంవత్సరాలలో బంగారు పథకాలను సాధించడం జిల్లాకే గర్వకారణమని అన్నారు.సమాజానికి ఉపాధ్యాయుడు వెన్నుముక లాంటి వాడని అటువంటి ఉపాధ్యాయుడిని



తయారు చేసే విద్య కళాశాలలు అత్యంత విలువైనవని అన్నారు.తెలంగాణ యూనివర్సిటీ మొదటి స్నాతకోత్సవంలో కూడా కర్షక్ బి.ఎడ్ విద్యార్థినికే బంగారు పతకం రావడం జరిగిందని అన్నారు,ఈ సందర్భంగా ఆయన బంగారు పథకాలను సాధించిన ఐదుగురు విద్యార్థులను కళాశాల యాజమాన్యంతో కలిసి ఘనంగా సన్మానించారు,బంగారు పథకాలు సాధించిన విద్యార్థులు మాట్లాడుతూ...మా విజయం వెనుక కళాశాల అధ్యాపకులు,తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిదని నిష్కలంకమైన ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేస్తూ,ఉత్తమ పౌరులను తయారు చేసేందుకు కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం పుండరీకా చారి,వీరయ్య,లక్ష్మయ్య,ప్రతాప్ రెడ్డి, జనార్దన్ రెడ్డి,పెంటయ్య,కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కె.రషీద్ అధ్యాపక బృందం కిషన్, డాక్టర్ బాలు,భీమాగౌడ్,మమత, తయ్యబ బాబురావు,విద్యార్థులు పాల్గొనడం జరిగింది

## కామారెడ్డిలో అరుదైన ఆపరేషన్



**కామారెడ్డి,జూలై17(సూర్య రేఖ)** కామారెడ్డి జిల్లా కేంద్రంలో అరుదైన ఆపరేషన్ చేశారు.మనిషి కడుపులోనుంచి 250 రాళ్ళను తొలగించిన వైద్యులు వివరాల్లోకి వెళ్తే కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం కృష్ణాజివాడి గ్రామానికి చెందిన దత్తుభాయి(65) వృద్ధురాలకు నెల రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతుంది. ఎన్ని ఆసుపత్రిలో తిరిగిన స్కానింగ్ చేసిన కడుపులో 5 నుంచి 6 రాళ్లు ఉన్నట్టుగా తేలింది.నొప్పి భరించలేని దత్తుభాయ్ మంగళవారం ఉదయం కామారెడ్డి పట్టణంలోని మాతృశ్రీ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేసుకోగా అన్ని రకాల పరీక్షలు చేసిన వైద్యురాలు గాల్ బ్లాడర్ లో రాళ్లు ఉన్నాయని నిర్ధారించి డాక్టర్ నాగేశ్వరరావు లే ప్రో స్కోపిక్ సర్జన్ బుధవారం సర్జరీ ఆపరేషన్ చేశారు.స్కానింగ్ రిపోర్ట్ ఆధారంగా ఆరు రాళ్లు అనుకున్న వైద్యులు ఆపరేషన్ చేసిన సమయంలో రాళ్లు బయటకు వస్తూనే ఉండటంతో ఆచార్యానికి గురయ్యారు.ఆపరేషన్ తర్వాత రాళ్లను లెక్కించగా 20 వరకు పెద్ద సైజు రాళ్లు మిగతా చిన్న రాళ్లు కలిపి మొత్తం 250 కి పైగా రాళ్లు ఉన్నట్లు గుర్తించారు.ఈ సందర్భంగా వైద్యురాలు డాక్టర్ శ్రావణిక మాట్లాడుతూ..వైద్యశాఖ చరిత్రలో తాను ఇప్పటివరకు ఇలాంటి ఆపరేషన్ చేయలేదని ఆమె అన్నారు.దత్తుభాయి వయసూర్య అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ కు ఆమె ఆరోగ్యం సహకరిస్తుందని ధృవీకరించుకున్నాకే ఆపరేషన్ చేయడానికి నిర్ణయించామని ఆమె తెలిపారు.ప్రస్తుతం పేషెంట్ ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. పేషెంట్ కు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆపరేషన్ చేసిన వైద్య సిబ్బందికి కుటుంబ సభ్యులు,గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## విలువలు లేని వ్యక్తి పంజా విజయ్ కుమార్..

**మంచి గుర్తింపు ఇచ్చిన పార్టీకి నమ్మకద్రోహం చేశాడు..**
**సీనియర్లను కాదని అవకాశం ఇస్తే వెన్నుపోటు..**
**బీజేపీ పట్టణ అధ్యక్షుడు అవినాష్ రెడ్డి..**



**రామాయంపేట,జులై17(సూర్య రేఖ)** విలువలు లేని వ్యక్తి నిజాంపేట మాజీ జెడ్పిటిసి పంజా విజయ్ కుమార్ అని బిజెపి పట్టణ అధ్యక్షుడు అవినాష్ రెడ్డి ఆరోపించారు.పార్టీలో సీనియర్ నాయకులను కాకుండా విజయ్ కుమార్ బడుగు,బలహీన వర్గాల వ్యక్తిగా గుర్తించి పార్టీ మెదక్ అసెంబ్లీ టికెట్ ఇస్తే గెలవలేక పోయిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. అయినా పార్టీ నాయకులు అధిష్టానం ఏమాత్రం నిరాశ చెందకుండా పార్టీ గౌరవించడం జరిగిందని అన్నారు.కానీ విజయ్ కుమార్ మాత్రం ఏ మాత్రం విశ్వాసం లేకుండా పార్టీకి వెన్నుపోటు పొడవడం సమంజసం కాదన్నారు.పార్టీలో చాలామందికి విలువలు ఉన్నాయని అలాంటి వాటిలో పనిచేసే అదే పార్టీని నిందించడం ఆయన విజ్ఞతకు వదిలేస్తున్నామన్నారు.వ్యక్తిగత స్వార్థం కోసం పార్టీలు మారే ఇలాంటి వ్యక్తులను ఎవరు నమ్మకూడదని అన్నారు.ప్రజా సేవకు ముందుకు వస్తున్నానని గొప్పలు చెప్పుకోవడం కాదు అదే ప్రజల కోసం నమ్ముకున్న కార్యకర్తల కోసం పనిచేస్తే ఏ పార్టీలో ఉన్న గుర్తింపు ఉంటుందన్నారు.కానీ బిజెపి దేశం కోసం ప్రజల కోసం నమ్ముకున్న కార్యకర్తల కోసం ఎల్లప్పుడు పనిచేస్తుందని విషయం అందరికీ తెలిసింది అన్నారు.పంజా విజయ్ కుమార్ భవిష్యత్తులో రాజకీయంగా అణిగిపోవడం ఖాయమన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షన్ లో మంచిర్యాలకు 72వ ర్యాంక్



**మంచిర్యాల,జులై17(సూర్య రేఖ)** శానిటేషన్ విభాగంలో సెంట్రల్ గవర్నమెంట్ స్వచ్ఛ సర్వేక్షన్ 2024-25 కు గాను మంచిర్యాలకు 72వ ర్యాంక్ వచ్చింది.తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 143 మున్సిపాలిటీలకు గాను మంచిర్యాల పట్టణానికి మెరుగైన పరిశుభ్రతకు గాను 72వ ర్యాంక్ రాగా,నస్పూర్ మున్సిపాలిటీకి 75వ ర్యాంక్ వచ్చింది.దేశ వ్యాప్తంగా 50000-3 లక్షల జనాభాలో మొత్తం 843 మున్సిపాలిటీలు ఉండగా మంచిర్యాల పట్టణానికి 445 వ ర్యాంక్ రాగా,నస్పూర్ కి 450 వ ర్యాంక్ వచ్చింది.ఈ సందర్భంగా సానిటరీ ఇన్స్పెక్టర్ వైకుంఠం మాట్లాడుతూ. 2023-24 వ సంవత్సరం స్వచ్ఛ సర్వక్షణలో మంచిర్యాల పట్టణం 121 వ ర్యాంక్ రాగా ఈ సంవత్సరం 72వ ర్యాంక్ రావడంలో కీలక పాత్ర పోషించిన పట్టణ ప్రజలకు,ప్రజా ప్రతినిధులకు, స్వచ్ఛంద సంస్థలకు మెప్మా సిబ్బందికి,ఎస్ హెచ్ జి సిబ్బందికి,పరిశుభ్ర కార్మికులకు,మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.అసిస్టెంట్ మున్సిపల్ కమీషనర్ రాజ్ మనోహర్,మున్సిపల్ మేనేజర్ కరుణాకర్,హెల్త్ అసిస్టెంట్ ఆరిఫ్, ఎన్విరాన్మెంటల్ ప్రశాంత్ మాట్లాడుతూ..వచ్చే సంవత్సరం స్వచ్ఛ సర్వేక్షణలో ఇంకా మెరుగైన ర్యాంక్ సాధించడానికి కృషి చేస్తామన్నారు.

# అనిల్ కుటుంబానికి అండగా ఉంటాం





**అనిల్ ను చంపిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి..**
**రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

**కొల్చారం,జులై 17(సూర్యరేఖ)** కొల్చారం మండలం వరిగుంతం సబ్ స్టేషన్ సమీపంలో గత సోమవారం రాత్రి దారుణ హత్యకు గురైన కాంగ్రెస్ యువ నాయకుడు మరెల్లి అనిల్ కుటుంబ సభ్యులను గురువారం రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించారు.అతని తండ్రి అనంతయ్య,తల్లి ఏసమ్మ,మృతుని భార్య శిరీష,సోదరుడు నవీన్ లతో మాట్లాడి సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మెదక్ డిఎస్పీలతో మాట్లాడారు.అనిల్ ను చంపిన నిందితులను కఠినంగా శిక్షపడేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దర్యాప్తును వేగవంతం చేసి నింతులకు శిక్ష పడేలా చూడాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి,కొల్చారం ఎస్సై మొహమ్మద్ గౌస్, డిబిఎస్ జిల్లా అధ్యక్షుడు శంకర్ ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్రె ప్రభాకర్ మాజీ ఉప సర్పంచ్ సుమలత బాబు మండలంలోని వివిధ గ్రామాల చిన్న దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.




## విద్యుత్ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాజేంద్రనగర్ సర్కిల్ నూతన కమిటీ



**రాజేంద్రనగర్,జూలై 17(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాజేంద్రనగర్ సర్కిల్ రీజినల్ కమిటీని ఎన్నుకున్నారు.అసోసియేషన్ సభ్యుల ఏకగ్రీవ అంగీకారంతో రీజినల్ అధ్యక్షులుగా వి. జైపాల్,రీజినల్ కార్యనిర్వాహక అధ్యక్షులుగా సి. చంద్రమౌళి రీజినల్ వైస్ ప్రెసిడెంట్ గా జి.వెంకట స్వామి,రీజినల్ ప్రధాన కార్యదర్శిగా ఎం.యాదయ్య , రీజినల్ జాయింట్ సెక్రటరీగా ఏ.శ్రీనివాస్ రీజినల్ ఫైనాన్స్ సెక్రటరి కే.సురేష్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా జె. శంకర్,రీజినల్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు పుట్టపాక పరశురాములు సి.యాదగిరి వెంకటేష్ ఏ.రాములు, హేమలత లను ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమం అసోసియేషన్ టిజీ ఎస్పీడీసీఎల్ కంపెనీ నాయకుల పర్యవేక్షణలో విజయవంతంగా కొనసాగింది. దీనిలో కంపెనీ జనరల్ సెక్రటరీ జి.బీచు పల్లి,కంపెనీ కార్యనిర్వాహక అధ్యక్షులు జె. నర్సింహులు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎస్. మహేష్ పాల్గొన్నారు.

# హెచ్‌సీఏ వివాదంలో కేటీఆర్, కవిత






**హైదరాబాద్ :** దరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆర్థిక కుంభకోనం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇప్పటికే ఈ కేసులో ఐదుగురిని అరెస్ట్ చేయగా తాజాగా సీఐడీ వారిని కస్టడీలోకి తీసుకుంది. ఆరు రోజుల పాటు సీఐడీ వారిని విచారించనుంది. ఈక్రమంలో సీఐడీ అధికారులు వారిని చర్లపల్లి జైలు నుంచి అదుపులోకి తీసుకున్నారు. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహ్ రావు, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ సెక్రటరీ రాజేందర్ యాదవ్, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ ప్రెసిడెంట్ కవిత యాదవ్, హెచ్‌సీఏ సీఈవో సునీల్, హెచ్‌సీఏ ట్రెజరర్ శ్రీనివాసరావులను సీఐడీ విచారించనుంది. ఇదిలా ఉంటే తాజాగా ఈకేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత మీద తెలంగాణ క్రికెట్ అసోసియేషన్(టీసీఏ).. సీఐడీకి ఫిర్యాదు చేసింది. ఆ వివరాలు..హెచ్‌సీఏ ఎన్నికల్లోకి ఉన్నట్లుండి జగన్‌మోహన్ రావు రావడం వెనుక కేటీఆర్, కవితల హస్తం ఉందని ఆరోపిస్తూ.. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ గురువారం నాడు సీఐడీకి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు టీసీఏ అధికారులు నేడు అడిషనల్ డీజ చారు సిన్హాను కలిశారు. హెచ్‌సీఏ ప్రెసిడెంట్ జగన్‌మోహన్ రావు గెలిచిన వెంటనే తన విజయాన్ని కేటీఆర్, కవిత, హరీష్ రావుకి అంకితం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దీనిపై ఫిర్యాదు చేస్తూ, కవిత, కేటీఆర్‌తో పాటు హెచ్‌సీఏలోని కొందరు అక్రమార్కులపై దర్యాప్తు చేయాలని కోరారు. గత 10 ఏళ్లలో బీసీసీఐ నుంచి దాదాపు రూ.500-600 కోట్ల నిధులు వచ్చినా, క్రికెట్ అభివృద్ధికి సంబంధించిన పనులు జరగలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.క్రికెట్ అభివృద్ధి కోసం బీసీసీఐ నుంచి హెచ్‌సీఏకు భారీగా నిధులు వచ్చినా.. హైదరాబాద్‌లో మాత్రం క్రికెట్ అభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని.. అలానే హైదరాబాద్‌లో క్రికెట్ కోసం ఎలాంటి కొత్త ఆస్తులు కొనలేదని తెలిపారు. పైగా ఉన్న వాటిని అభివృద్ధి చేయలేదని ఆరోపించారు.. గత 10 ఏళ్లలో హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్ల ఆస్తులు మాత్రం బాగా పెరిగాయని ఫిర్యాదులో ఆరోపించారు. దీనిని బట్టి హెచ్‌సీఐఏలో అవినీతి జరిగిందని స్పష్టంగా అర్థం అవుతుందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ సీఐడీకి ఫిర్యాదు చేసింది. ఈ మొత్తం అవినీతి బాగోతంపై సీఐడీ ఫోకస్ పెట్టింది. కస్టడీ విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.హెచ్‌సీఏ వివాదంలో ఇప్పటికే చర్లపల్లి జైలులో ఉన్న నిందితులను జులై 21 వరకు సీఐడీ కస్టడీలో ఉంచేందుకు కోర్టు అనుమతించి సంగతి తెలిసిందే. అలానే దర్యాప్తు వేగవంతం కావాలని సూచించింది. నిందితులను గురువారం ఉదయం చర్లపల్లి జైలు నుంచి సీఐడీ అధికారులు కస్టడీకి తీసుకోనున్నారు. హెచ్‌సీఏ నిధుల దుర్వినియోగం, అక్రమ లావాదేవీలపై మరింత లోతుగా దర్యాప్తు జరగనుంది. కోర్టు అనుమతితో సీఐడీ అధికారులు ఆర్థిక రికార్డులు, సాక్ష్యాలు సేకరించనున్నారు.

సిఐడీ కస్టడీకి నిందితులు

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆర్థిక కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది.హెచ్‌సీఏ కేసులో ఐదుగురు నిందితులను ఇవాళ కస్టడీకి తీసుకోనుంది సీఐడీ. నిందితులను ఆరు రోజులపాటు కస్టడీకి అనుమతించడంతో చర్లపల్లి జైలు నుంచి అదుపులోకి తీసుకోనున్నారు. హెచ్‌సీఏ క్లబ్స్‌లో అవకతవకలు, గత హెచ్‌సీఏ ఎన్నికల్లో చోటు చేసుకున్న పరిణామాలపై ప్రధానంగా ప్రశ్నించనుంది సీఐడీ. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు, హెచ్‌సీఏ సీఈవో సునీల్, హెచ్‌సీఏ ట్రెజరర్ శ్రీనివాసరావు, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ సెక్రటరీ రాజేందర్‌యాదవ్, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ ప్రెసిడెంట్ కవిత యాదవ్‌ను విచారించనుంది సీఐడీ. ఈ ఐదుగురు నిందితుల బెయిల్ పిటిషన్లను కొట్టివేసిన మల్కాజ్‌గిరి కోర్టు? ఇవాల్టి నుంచి ఆరు రోజులపాటు కస్టడీకి అనుమతించింది. హెచ్‌సీఏ స్కామ్‌లో అరెస్టు చేసిన నలుగురు నిందితులతో సహా అధ్యక్షుడు జగన్మోహన్ రావుకు, సీఐడీ అధికారులు కస్టడీ కోరింది. దీనితో మల్కాజ్‌గిరి కోర్టు ఆరు రోజుల కస్టడీకి అనుమతినిచ్చింది.ఇప్పటికే చర్లపల్లి జైలులో ఉన్న నిందితులను జూలై 21 వరకు సీఐడీ కస్టడీలో ఉంచేందుకు అనుమతిచ్చిన కోర్టు, దర్యాప్తు వేగవంతం కావాలని సూచించింది. నిందితులను గురువారం ఉదయం చర్లపల్లి జైలు నుంచి సీఐడీ అధికారులు కస్టడీకి తీసుకోనున్నారు. హెచ్‌సీఏ నిధుల దుర్వినియోగం, అక్రమ లావాదేవీలపై విచారణ మరింత లోతుగా జరగనుంది. కోర్టు అనుమతితో సీఐడీ అధికారులు ఆర్థిక రికార్డులు, సాక్ష్యాలు సేకరించనున్నారు. ఇప్పటికే నకిలీ పత్రాలతో జగన్మోహన్ రావు శ్రీచక్ర క్రికెట్ క్లబ్ ఏర్పాటు చేసినట్టు సీఐడీ విచారణలో తేలింది. నకిలీ పత్రాలతో ఏర్పాటు చేసిన క్లబ్ ద్వారానే ఊఅంలో అధ్యక్షుడిగా పోటీ చేసినట్టు గుర్తించారు. గౌలిపుర క్రికెట్ క్లబ్ బీఎన్ అధ్యక్షుడు సీ. కృష్ణ యాదవ్ సంతకాన్ని జగన్ మోహన్ రావు ఫోర్జరీ చేసినట్టు సీఐడీ గుర్తించింది. దేశానికి అత్యుత్తమ క్రికెటర్లను అందించిన సంఘం హెచ్‌సీఏ? ఇప్పుడు అవినీతికి కేరాఫ్‌గా మారింది. అక్కడ జరుగుతున్న ఆటంతా అవినీతి ఇన్నింగ్సే. సొమ్మును తెగతినడంలో ఆరితేరిపోయారు. బీసీసీఐ నుంచి అప్పనంగా వచ్చిపడుతున్న కోట్లు? హెచ్‌సీఏ పెద్దల జేబుల్లోకి వెళ్తున్నాయ్ తప్ప ఆటను అభివృద్ధి చేయలేకపోతున్నాయ్. ఈ మొత్తం అవినీతిపై సీఐడీ ఫోకస్ పెట్టింది. కస్టడీ విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది

## ఘనంగా పన్యాల వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు..



**నిజాంపేట,జూలై17(సూర్యరేఖ)** నిజాంపేట మండల కేంద్రానికి చెందిన పన్యాల వెంకటరెడ్డి 38వ జన్మదిన వేడుకలను గురువారం పార్టీలకు అతీతంగా ఆయనకు శాలువా కప్పి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బాపురెడ్డి,తాజీమాజీ సర్పంచ్ అమర సేనా రెడ్డి,పంజా మహేందర్,నసీరుద్దీన్,మౌవురం రాజు నాయిని లక్ష్మణ్,రాములు గౌడ్,రెడ్డిశెట్టి రవీందర్,రంజిత్ గౌడ్,నగేష్ ప్రశాంత్ గౌడ్,సిద్ధిక్,చంద్రకాంత్ గౌడ్,రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం



**రామకృష్ణాపూర్,జులై17(సూర్య రేఖ)** రామకృష్ణాపూర్ స్థానిక కనకదుర్గ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ కొండ్ర రవి అనారోగ్యానికి గురై మృతి చెందడం జరిగింది.ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.మృతుడు రవిది చాలా బీద కుటుంబం.వారి ఆర్థిక పరిస్థితులు తెలుసుకొని వారి కుటుంబానికి గురువారం రామకృష్ణాపూర్ ఆటో యూనియన్ సభ్యులు రూ.పది వేలు సమకూర్చి ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు గాండ్ల సమ్మయ్య చేతుల మీదగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు ఎనగంటి సంపత్,ఉపాధ్యక్షులు పాక అంజయ్య ప్రధాన కార్యదర్శి జీడి రవి,చెన్నాల సారయ్య,ముల్కల నరసయ్య,అలక పున్నం,వాసం సది,ఇతరులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్వాన్ దర్బార్ మైసమ్మ బోనాలు

**భక్తుల సాఖలు,పూజలు**



**నాంపల్లి,జూలై17(సూర్యరేఖ)** ఆషాడ మాస బోనాలను పురస్కరించుకుని అమ్మవారి ఘటాలు,భక్తుల పూజలు అందుకోవడం ఒక ఎత్తయితే జియాగూడ సత్యనారాయణ నగర్ లో కార్వాన్ దర్బార్ మైసమ్మవారి ఘటం సబ్జిమండి నల్ల పోచమ్మ అమ్మవారు,మహంకాళి అమ్మవారి గంటలు ఒక్క చోట కలవడం మహాభాగ్యమని,ఇదో అరుదైన సంఘటన చోటుచేసుకుందని జియాగూడ డివిజన్ భారతీయ జనతా పార్టీ అనుబంధ ఓబీసీ మోర్చా మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం శివశంకర్ అన్నారు.ఈ సందర్భంగా గుర్రం శివశంకర్ మాట్లాడుతూ..అనుకోకుండా ఇరు ప్రాంతాల అమ్మవార్ల ఘట్టాలు ఒక్క బస్తీలో ఒకే సారి కలవడం ప్రాంత వాసుల అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు.పరిసర ప్రాంతాల ప్రజలు అమ్మవార్లకు శాఖలు పోసి,మొక్కులు చెల్లించు కోవడం మహాభాగ్యం భావిస్తున్నామని,అమ్మవార్లు ప్రజలను సుఖః సంతోషాలతో ఆయురారోగ్యాలతో తులతూగేటట్టు చూడాలని అమ్మవార్లను కోరుకోవడం జరిగిందని గుర్రం శివశంకర్ తెలిపారు.

## దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలు

**శ్రీశైలం :** లోకకల్యాణంకోసం శ్రీశైలం దేవస్థానం గురువారం రోజు ఆలయప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న శ్రీ దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలను నిర్వహించింది.ప్రతి గురువారం దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది.ఈ పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించబడింది. ఆ తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి.లోకోద్ధరణకోసమై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒకే స్వరూపములో దత్తాత్రేయునిగా అవతరించారు.అందుకే త్రిమూర్తి స్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్ధుడు.కాగా శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల వారికి ఎంతో దగ్గర సంబంధం ఉంది..ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయులవారు తపస్సు చేశారని ప్రతీతి. అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు కాగా దత్తాత్రేయస్వామి వారు కలియుగంలో గోదావరితీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు.

# బిజినెస్

## కాకినాడ ఎల్ఎన్‌జీ టెర్మినల్ ప్రాజెక్టులో కదలిక



ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వద్ద క్రౌన్ ఎల్ఎన్‌జీ హెూల్డింగ్స్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేసే ఎల్ఎన్‌జీ టెర్మినల్ ప్రాజెక్టుకు సంబంధించి మరో అడుగు ముందుకు పడింది. ఈ టెర్మినల్‌ను అనుసంధానం చేస్తూ పైప్‌లైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (పీఐఎల్) పైప్‌లైన్ ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించిన అవగాహనా ఒప్పందం (ఎంఓయూ)పై ఇటీవల క్రౌన్ ఎల్ఎన్‌జీ హెూల్డింగ్స్ సీఈఓ స్వపన్ కటారియా, పీఐఎల్ ఎండీ అఖిల్ మెహరోత్రా సంతకాలు చేశారు. క్రౌన్ ఎల్ఎన్‌జీ.. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఎల్ఎన్‌జీని రీగ్యాసిఫికేషన్ చేసి దేశ ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లోని వినియోగదారులకు ఈ పైప్‌లైన్ ద్వారా సరఫరా చేస్తుంది. రూ.9,000 కోట్ల ప్రాజెక్టు: కాకినాడ ఎల్ఎన్‌జీ ప్లాంట్ కోసం క్రౌన్ ఎల్ఎన్‌జీ హెూల్డింగ్స్ రూ.9,000 కోట్ల వరకు ఖర్చు చేయనుంది. వచ్చే ఏడాది నిర్మాణం ప్రారంభించి నాలుగేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఏటా 72 లక్షల టన్నుల ఎల్ఎన్‌జీ దిగుమతి సామర్థ్యంతో ఏర్పాటు చేసే కాకినాడ ఎల్ఎన్‌జీ టెర్మినల్ కోసం కృష్ణ గోదావరి ఎల్ఎన్‌జీ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ప్రత్యేక అనుబంధ కంపెనీని కూడా ఏర్పాటు చేసింది. కాగా ఎనర్జీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ట్రస్ట్ (ఇన్విట్).. స్పెషల్ పర్పస్ వెహికల్‌గా పీఐఎల్ ఉంది. ఈ సంస్థ గుజరాత్‌లోని బరూచ్ నుంచి కాకినాడ వరకు దాదాపు 1,400 కిలోమీటర్ల పైప్‌లైన్‌ను నిర్వహిస్తోంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ సహా మరికొన్ని సంస్థలు ఇక్కడ క్షేత్రాల నుంచి సహజ వాయువును రవాణా చేసేందుకు ఈ పైప్‌లైన్‌ను ఉపయోగిస్తున్నాయి.

## ఎన్ఐఆర్ఎం- సిబీ మైనింగ్ మధ్య ఎంఓయూ




మైనింగ్, మౌలిక సదుపాయాల రంగంలో కంట్రోల్డ్ బ్లాస్టింగ్ టెక్నాలజీని ఉపయోగించేం దుకు ఓ ముందడుగు పడింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన గనుల మంత్రిత్వశాఖ కింద పనిచేసే స్వతంత్ర పరిశోధన సంస్థ అయిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ (ఎన్ఐఆర్ఎం), సిబీ మైనింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రయివేట్ లిమిటెడ్ కలిసి దేశవ్యాప్తంగా ప్రాజెక్టులలో సహకరించుకోవడానికి ఒక ఎంఓయూ కుదుర్చుకున్నాయి. ఈ ఎంఓయూ మీద సిబీ సంస్థ వ్యవస్థాపకుడు, ఎండీ సిబీ లూకోస్, ఎన్ఐఆర్ఎం డైరెక్టర్ (అదనపు చార్జి) డాక్టర్ శ్రీపాద్ ఆర్ నాయక్ బుధవారం సంతకాలు చేశారు. ఈ రెండు సంస్థలకు ఉన్న సాంకేతిక నైపుణ్యంతో దేశవ్యాప్తంగా కీలకమైన ప్రాజెక్టులలో సురక్షితంగా, కచ్చితంగా, సరికొత్త సజనాత్మక పద్ధతుల్లో బ్లాస్టింగ్ పరిష్కారాలకు దారి చూపుతాయి. 2000 సంవత్సరంలో హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ప్రారంభించిన సిబీ మైనింగ్ దేశంలో కంట్రోల్డ్ బ్లాస్టింగ్ విషయంలో నైపుణ్యం ఉన్న సంస్థల్లో ఒకటిగా మంచి గుర్తింపు పొందింది. జాతీయ రహదారులు, విద్యుత్ ప్రాజెక్టులు, మైనింగ్‌లో వ్యర్థాల తొలగింపు, ఉత్పత్తి పెంపుదల కోసం తవ్వకాలు, రాళ్ల బ్లాస్టింగ్ పనులను ఈ ఎన్ఐఆర్ఎం, సిబీ మైనింగ్ మధ్య ఒప్పందం ఈ ఒప్పందం సురక్షిత, ఖచ్చితమైన బ్లాస్టింగ్ పరిష్కారాలను అందించి, బొగ్గు తవ్వకాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధిని పెంచుతుందని ఆ సంస్థలు పేర్కొన్నాయి. ఈ ఒప్పందంపై సిబీ మైనింగ్ ఎండీ సిబీ లూకోస్, ఎన్ఐఆర్ఎం డైరెక్టర్ డాక్టర్ శ్రీపాద్ ఆర్. నాయక్ సంతకాలు చేశారు.

# మేక్ ఇన్ ఇండియాకు తూట్లు!

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మేక్ ఇన్ ఇండియాకు అమెరికా తూట్లు పొడిచే ప్రయత్నంలో ఉంది. ఇప్పటికే దేశంలో మందగమనాన్ని ఎదుర్కొంటున్న తయారీ రంగం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్యలతో మరింత ఒత్తిడిని ఎదుర్కొనే సంకేతాలు కనబడుతున్నాయి. అమెరికా-భారత్ మధ్య జరుగుతున్న నాలుగు రోజుల వాణిజ్య చర్చలు గురువారం నాటితో ముగియనున్నాయి. ఆగస్టు 1 గడువు ముందు తాత్కాలిక ఒప్పందం కుదుర్చుకునే దిశగా చర్చలు వేగంగా సాగుతున్నాయి. జన్యు మార్పిడి విత్తనాలు, పాడి రంగం, స్టీల్, అల్యూమినియం, ఆటోమొబైల్ రంగాలు ఈ చర్చలలో కీలక అంశాలుగా ఉన్నాయి. ఈ చర్చల వివరాలను ఇరు దేశాలు చాలా రహస్యంగా ఉంచుతున్నాయి. భారత అధికారులు ఎలాంటి అంశాలను బయట పెట్టడం లేదు. ఈ సంప్రదింపుల్లో అమెరికా ఒత్తిడికి భారత్ తలొగ్గితే ముఖ్యంగా స్టీల్, ఫార్మా, ఆటో పరిశ్రమ రంగాలు సంక్షోభాన్ని ఎదుర్కోవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. యుఎస్‌లో పూర్తిగా తయారయిన విద్యుత్ వాహనాలు భారత్‌కు భారీగా దిగుమతి కానున్నాయి. దీంతో ఇక్కడి వాహన పరిశ్రమ గడ్డుకాలాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ఫార్మా రంగంపై యుఎస్ అధిక టారిఫ్‌లు విధిస్తే ఎగుమతులు తగ్గనున్నాయి. మరోవైపు స్టీల్ రంగంలో 50 శాతం టారిఫ్‌లు ఎగుమతులను దెబ్బతీయనున్నాయి. దీంతో భారత్‌లోని ఈ పరిశ్రమల్లో తయారీ తగ్గనుంది. స్టీల్ ఉత్పత్తులపై అధిక టారిఫ్‌ల వల్ల 2024-25లో ఆ రంగం ఎగుమతులు 2.8 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ టారిఫ్‌లను 20 శాతం కంటే తక్కువకు తగ్గించాలని భారత్ కోరుతోంది. మరోవైపు



తనకు ఆకర్షణీయమైన ఒప్పందం కోసం అమెరికా అన్ని ఒత్తిడిలను చేస్తోందని సమాచారం. అమెరికా తన ఎలక్ట్రిక్ వాహనాల (ఇవి) కంపెనీలైన టెస్లా, ఫోర్డ్‌కోసం భారత మార్కెట్‌లో సులభమైన ప్రవేశం కోరుతోంది. ప్రస్తుతం వీటిపై ఉన్న 70-100 శాతం దిగుమతి సుంకాలను తగ్గించాలని డిమాండ్ చేస్తోంది. అదనంగా బ్యాటరీలు, సెమీకండక్టర్ తదితర ఆటో కాంపోనెంట్‌లపై 15-30 శాతం సుంకాలను తగ్గించాలని అడుగుతోంది. తక్కువ సుంకాలను విధిస్తే రెడీమేడ్ కార్లను భారత్‌కు ఎగుమతి చేయాలని యుఎస్ భావిస్తోంది. ఇందుకు టెస్లా కార్ల దిగుమతినే ముఖ్య ఉదాహరణ. కాగా.. భారత్ ఇక్కడి వాహనాల కంపెనీలకు మద్దతుగా మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా స్థానిక ఉత్పత్తిని పెంచేలా ప్రోత్సాహాలను ఇస్తుంది. ఒక వేళ అమెరికా కంపెనీలకు సులభ మార్కెట్‌ను అనుమతిస్తే.. ఇక్కడి వాహన పరిశ్రమలు ఆర్థిక ఒత్తిడిలోకి జారుకునే ప్రమాదం ఉంది.

# తెలుగు రాష్ట్రాల్లో గోల్డ్ రేట్స్

బంగారం కొనుగోలు చేసేవారికి తీపి కబురు. నేడు బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. భారతదేశంలో బంగారినికి ఉన్న డిమాండ్ దేనికి ఉండదు. చాలా మంది ఎక్కువగా కొనుగోలు చేసే దానిలో బంగారమే ముందుంటుంది. మరీ ముఖ్యంగా మహిళలకు బంగారం చాలా ఇష్టం ఉంటుంది. అందుకే వారు ఏ చిన్న శుభ కార్యం జరిగినా సరే బంగారమే కొనుగోలు చేయాలి అనుకుంటారు. ఇక ప్రస్తుతం బంగారం ధరలు విపరీతంగా పెరుగుతూ లక్షకు చేరువ అవుతున్న విషయం తెలిసిందే. దీంతో సామాన్యులు బంగారం కొనుగోలు చేయడానికే భయపడుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. కానీ నేడు ( గురువారం) బంగారం ధరలు అతి స్వల్పంగా తగ్గాయి. కాగా, మనం నేడు అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం, తెలుగు రాష్ట్రల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర తులం రూ.99,270, 22 క్యారెట్ల బంగారం తులం రూ.90,990, 18 క్యారెట్ల బంగారం తులం రూ.74,450గా ఉంది. ఇక చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర తులం రూ.99,270, 22 క్యారెట్ల బంగారం




తులం రూ.90,990, 18 క్యారెట్ల బంగారం తులం రూ.74,450గా ఉంది. గుంటూరులో 24 క్యారెట్ల బంగారం ధర తులం రూ.99,270, 22 క్యారెట్ల బంగారం తులం రూ.90,990, 18 క్యారెట్ల బంగారం తులం రూ.74,450గా ఉంది. మిగతా అన్ని నగరాల్లోనూ దాదాపు ఇవే ధరలు కొనసాగుతున్నాయి. జూలై 17, 2025న 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,270 గా ఉండగా,22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.90,990గా ఉంది. జూలై 16, 2025 బుధ వారం (నిన్న)24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,780గా ఉండగా,నేడు రూ.10 తగ్గడంతో గోల్డ్ రేట్ రూ.99,270గా ఉంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర నిన్న రూ.91,000గా ఉండగా, నేడు రూ.10 తగ్గడంతో గోల్డ్ రేట్ రూ.90,990గా ఉంది. ప్రముఖ నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే.. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.99,270 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.90,990 లుగా ఉంది. ఇక నేడు సిల్వర్ ధర స్వల్పంగా తగ్గింది. కిలో వెండి పై రూ.100 తగ్గడంతో కేజీ వెండి రూ.1,23,900గా ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,270 ఉంటే.. 22 క్యారెట్ల ధర రూ.90,990లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,23,900 లుగా ఉంది.వరంగల్ జిల్లాలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,270. 22 క్యారెట్ల ధర రూ.90,990లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,23,900లుగా ఉంది.

# టెస్టు క్రికెట్ లెజెండ్స్

## అత్యధికసార్లు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు'లు అందుకుంది వీరే



టీమిండియా- ఇంగ్లండ్ మధ్య టెస్టు సిరీస్.. క్రికెట్ ప్రేమికులకు అసలు సిసలైన సంప్రదాయ ఫార్మాట్ మజాను అందిస్తోంది. ఆండర్సన్-టెండుల్కర్ ట్రోఫీలో భాగంగా ఇరుజట్ల మధ్య ఐదు టెస్టుల సిరీస్‌లో ఇప్పటికి మూడు పూర్తయ్యాయి. అయితే, ఈ మూడు టెస్టులు ఆఖరిదైన ఐదో రోజు వరకు ఉత్కంఠగా సాగడం ఒక విశేషమైతే.. అ?న్నింటిలోనూ ఫలితం కూడా తేలడం మరో విశేషం. లీడ్స్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఓపెనర్ బెన్ డకెట్ మ్యాచ్‌ను టీమిండియా నుంచి లాగేసుకుని ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఇక ఎడ్జ్‌బాస్టన్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిన టీమిండియా సారథి శుబ్‌మన్ గిల్ డబుల్ సెంచరీ (269), సెంచరీ (161)లతో అదరగొట్టి.. భారత్‌కు ఏకపక్ష విజయం అందించాడు. ఎడ్జ్‌బాస్టన్‌లో తొలిసారి టీమిండియా గెలుపు జెండా ఎగరవేయడంలో కీలక పాత్ర పోషించి ఈ అవార్డు అందుకున్నాడు. అయితే, లార్డ్స్ టెస్టులో మాత్రం ఆతిథ్య జట్టు మరోసారి పైచేయి సాధించింది. కెప్టెన్ బెన్ స్టోక్స్ ఇటు బ్యాట్‌తో.. అటు బంతితో రాణించి.. జట్టును గెలిపించుకున్నాడు. తద్వారా 2-1తో ఆధిక్యంలో నిలిపాడు. ఇలా మూడు టెస్టుల్లో ఒక్కొక్కరు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. మరి టెస్టు ఫార్మాట్లో అత్యధికసార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు అందుకున్న క్రికెటర్ల జాబితాలో టాప్-5లో ఉన్నది ఎవరో తెలుసా?!.. సంప్రదాయ క్రికెట్‌లో అత్యధిక పరుగుల వీరుడి (15921)గా ఉన్న టీమిండియా దిగ్గజం సచిన్ టెండుల్కర్ మాత్రం ఈ జాబితాలో లేకపోవడం గమనార్హం.

### జాక్వెస్ కలిస్

సౌతాఫ్రికా లెజెండరీ ఆల్‌రౌండర్ జాక్వెస్ కలిస్ టెస్టుల్లో అత్యధికంగా 23 సార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. తన కెరీర్‌లో 166 టెస్టు మ్యాచ్‌లు ఆడిన కలిస్.. 13289 పరుగులు చేశాడు. ఇందులో 45 శతకాలు, రెండు డబుల్ సెంచరీలు ఉన్నాయి.

### ముత్తయ్య మురళీధరన్

శ్రీలంక స్పిన్ దిగ్గజం టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యధిక వికెట్ల వీరుడు (800). అతడు తన కెరీర్‌లో 133 టెస్టులాడి 19 సార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు.

### వసీం అక్రం

పాకిస్తాన్ ఐకానిక్ ఫాస్ట్ బౌలర్ వసీం అక్రమ్ తన కెరీర్‌లో 104 టెస్టులు ఆడి.. 414 వికెట్లు కూల్చాడు. తన నిలకడైన బౌలింగ్‌తో ఈ స్వింగ్ సుల్తాన్ పదిహేడు సార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

### షేన్ వార్న్

ఆస్ట్రేలియా స్పిన్ లెజెండ్ షేర్ వార్న్. అంతర్జాతీయ క్రికెట్‌లో 145 టెస్టులు ఆడిన వార్న్.. 708 వికెట్లు పడగొట్టాడు. అతడి ఖాతాలోనూ పదిహేడు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు ఉన్నాయి.

### కుమార్ సంగక్కర


శ్రీలంక మాజీ కెప్టెన్, స్టైలిస్ లెఫ్టాండ్ బ్యాటర్ కుమార్ సంగక్కర తన కెరీర్‌లో 134 టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. నిలకడైన ప్రదర్శనలతో శ్రీలంక బ్యాటింగ్ లైనప్ ప్రధాన పిల్లర్‌గా పేరొందిన సంగక్కర పదహారు సార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. సంగక్కర టెస్టుల్లో 38 సెంచరీలు, 11 డబుల్ సెంచరీల సాయంతో 12400 పరుగులు సాధించాడు. అ న్న ట్లు చెప్పనే లేదు కదూ! సచిన్ తన కెరీర్‌లో పద్నాలుగు సార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును గెలుచుకున్నాడు.

# స్పోర్ట్స్

## సాత్విక్ - చిరాగ్ జోడీకి షాక్.. రెండో రౌండ్‌లోనే లక్ష్య సేన్ ఓటమి



జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్లకు వరుస పరాజయాలు ఎదురవుతున్నాయి. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా.. లక్ష్య సేన్ సాత్విక్ - చిరాగ్ ఆమెను అనుసరిస్తూ ఇంటిదారి పట్టారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఎనిమిదో ర్యాంకర్ సేన్ తేలిపోయాడు. స్థానిక ఆటగాడు కొడాయ్ నరొకా చేతిలో 19-21, 11-21తో అనూహ్యంగా కంగుతిన్నాడు. డబుల్స్‌లో ఫేవరెట్లుగా బరిలోకి దిగిన సాత్విక్ సాయిరాజ్ %-% చిరాగ్ శెట్టి ద్వయం తొలి రౌండ్‌లో అద్భుత విజయం సాధించింది. అయితే.. రెండో రౌండ్‌లో మాత్రం ఐదో సీడ్ జంట ధాటికి చేతులెత్తేసింది భారత జోడీ. గురువారం హెూరాహెూరీగా జరిగిన పోరులో లియాంగ్ వీ కెంగ్ వాంగ్ చాంగ్ (చైనా) జంటకు బదులివ్వలేకపోయింది చిరాగ్ ద్వయం. తొలి సెట్‌లో గట్టిగానే పోరాడినా..22-24తో వెనకబడింది. రెండో సెట్‌లో పుంజుకుంటారనుకుంటే బలహీనమైన డిఫెన్స్ కారణంగా 14-21తో దారుణ ఓటమి చవిచూసింది. ఈ పరాజయంతో చైనీస్ షట్లర్లు భారత స్టార్లపై తమ విజయాల ఆధిక్యాన్ని 7-2కు పెంచుకున్నారు.



# కింగ్‌డమ్ హీరోకు డెంగ్యూ.. ఆస్పత్రిలో విజయ్ దేవరకొండ !

ఫిల్మ్ స్టార్ విజయ్ దేవరకొండ  ఆస్పత్రిలో చేరాడు. అతను డెంగ్యూతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈనెల 20వ తేదీన అతను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. విజయ్ దేవరకొండ కానీ ఇతర సభ్యులు ఎవరూ ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు. దేవరకొండ నటించిన కొత్త చిత్రం కింగ్‌డమ్ ఈనెల 31వ తేదీన రిలీజ్ కానున్నది. కింగ్‌డమ్ చిత్రాన్ని గౌతం తిన్ననూరి డైరెక్ట్ చేశాడు. ఆ ఫిల్మ్‌లో భాగ్యశ్రీ బోర్సే, సత్యదేవ్ నటిస్తున్నారు. సీతార ఎంటర్‌టైన్మెంట్స్, ఫార్చూనర్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌పై ఆ మూవీని రిలీజ్ చేస్తున్నారు. పూర్తి స్థాయి కమర్షియల్ ఫిల్మ్‌గా కింగ్‌డమ్‌ను రూపొందించారు. వాస్తవానికి మార్చి 30న రిలీజ్ కావాల్సిన ఆ సినిమాను పోస్టు ప్రొడక్షన్ సమస్య వల్ల వాయిదా వేశారు. కింగ్‌డమ్ ఫిల్మ్‌కు చెందిన హిందీ వర్షన్‌ను థియేటర్లలో కాకుండా నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజ్ చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న డాన్ 3 చిత్రంలో విలన్ పాత్రలో విజయ్ దేవరకొండ పోషించనున్నట్లు తెలుస్తోంది. ఫర్హన్ అక్తర్‌కు సంబంధించిన ఆ ఫిల్మ్‌లో విక్రాంత్ మాసే స్థానంలో దేవరకొండకు ఛాన్స్ దక్కినట్లు కొన్ని రూమర్స్ వినిపిస్తున్నాయి.

# అమ్మాయి పోస్టర్ చూడగానే అందరూ పారిపోతారు

అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో వస్తోన్న చిత్రం పరదా. లేడీ ఓరియంటెడ్ మూవీగా వస్తోన్న ఈ సినిమాకు ప్రవీణ్ కంద్రేగుల దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో సంగీత, దర్శనా రాజేంద్రన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా వచ్చే నెల ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్‌కు ఇంకా నెల రోజుల సమయం ఉండగానే మేకర్స్ ప్రమోషన్స్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే ఈ సినిమా నుంచి ఓ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు హాజరైన అనుపమ పరమేశ్వరన్ తన సినిమా గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఒక అమ్మాయి లీడ్ రోల్‌గా సినిమా పోస్టర్ చూస్తే అందరూ కూడా వెనక్కి వెళ్లిపోతారని అనుపమ తెలిపింది. అది ప్రొడ్యూసర్స్, డిస్ట్రిబ్యూటర్స్, ఓటీటీతో పాటు ఆడియన్స్ కూడా కావొచ్చని పేర్కొంది. అయితే అది తప్పని నేను చెప్పట్లేదు..అదే రియాలిటీ అని అనుపమ వెల్లడించింది. ఆ రియాలిటీ నుంచే వచ్చిన సినిమా పరదా అని.. మా సినిమా దాదాపు ఏడాది క్రితమే పూర్తయిందని అనుపమ పరమేశ్వరన్ చెప్పుకొచ్చింది.  మా సినిమా రిలీజ్ డేట్ కోసం చాలా కష్టపడ్డామని.. చివరికీ ఆగస్టు 22న మీ ముందుకు వస్తున్నామని తెలిపింది.






## తెలుగులోకి రాబోతున్న తమిళ సూపర్‌హిట్ 'మై బేబీ'.. ఆసక్తికరంగా ట్రైలర్

ఇటీవల తమిళంలో విడుదలై భారీ విజయం సాధించిన '%ణచీూ%' చిత్రం ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. ఎస్.కె. పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మాత సురేష్ కొండేటి ఈ చిత్రాన్ని 'మై బేబి' పేరుతో ఈనెల జూలై 18న థియేటర్లలో విడుదల చేయబోతున్నారు. నెల్సన్ వెంకట్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నిమిషా సజయన్, అథర్వ మురళి కీలక పాత్రల్లో నటించారు. గతంలో 'ప్రేమిస్తే', 'జర్నీ', 'షాపింగ్ మాల్', 'పిజ్జా' వంటి విజయవంతమైన అనువాద చిత్రాలను అందించిన సురేష్ కొండేటి, 'మై బేబి'తో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ సినిమా విడుదలకు ఒక్కరోజే ఉండడంతో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. హాస్పిటల్ మాఫియా ఆధారంగా తెరకెక్కినట్లు తెలుస్తుంది. ఈ చిత్రం ఆనంద్ (అథర్వ), దివ్య (నిమిషా సజయన్) అనే జంట చుట్టూ తిరుగుతుంది. ఆనంద్ తన లవ్ ఫెయిల్ అవ్వడం వలన మందుకి బానిసగా మారతాడు. దివ్య బోర్డర్‌లైన్ పర్సనాలిటీ డిజార్డర్ అనే మానసిక సమస్యతో బాధపడుతూ ఉంటుంది. వీరిద్దరికి అనుకోకుండా పెళ్లి జరుగుతుంది. అయితే ఆనంద్ దివ్య మానసిక పరిస్థితిని అర్థం చేసుకుని, ఆమెను ప్రేమిస్తాడు. వారిద్దరూ సంతోషంగా జీవిస్తారు. ఈ క్రమంలోనే దివ్య గర్భవతి అవుతుంది, వారికి ఒక బాబు పుడతాడు. అయితే, బిడ్డ పుట్టిన కొన్ని నిమిషాలకే, ఆ బిడ్డ తమది కాదని, ఎవరో ఆసుపత్రిలో మార్చేశారని దివ్య పదేపదే చెబుతుంది. ఆమె మానసిక స్థితి కారణంగా మొదట ఎవరూ ఆమె మాటలు నమ్మరు. కానీ ఆనంద్ తన భార్య మాటలను నమ్మి, నిజం తెలుసుకోవడానికి బయలుదేరతాడు. ఆనంద్ తన బిడ్డను కనుగొనడానికి వెళ్లిన క్రమంలో పిల్లలను కిడ్నాప్ చేసి అమ్ముకునే ఒక పెద్ద నెట్‌వర్క్‌ను కనుగొంటాడు. అయితే ఈ నెట్‌వర్క్‌ని నడిపిస్తుంది ఎవరు. ఆనంద్ ఈ నెట్‌వర్క్‌ని ఎలా కనిపెట్టాడు. దివ్య తనకి పుట్టిన బిడ్డని మార్చేశారు అని ఎలా తెలుసుకుంటుంది అనేది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే.



## సత్యదేవ్ కోటి రూపాయల ఆర్టిస్ట్.. ఆ మార్క్ ఎప్పుడో దాటేశాడు!

టాలెంట్ ఆర్టిస్ట్ సత్యదేవ్ మొదట్లో హీరో స్నేహితుడి పాత్రలు చేసేవాడు. తర్వాత విలనిజం చేశాడు. అలాగే హీరోగానూ సినిమాలు చేస్తున్నాడు. ఆ మధ్య ఆర్ఆర్ఆర్ సినిమాలోనూ యాక్ట్ చేశాడు. కానీ ఎడిటింగ్‌లో తను కనిపించే దాదాపు 16 నిమిషాల సీన్లను లేపేశారు. కావాల్సినంత ప్రతిభ ఉన్నా.. ఎందుకో కాస్త వెనకబడుతున్నాడు. ఇతడు చివరగా నటించిన జీబ్రా కూడా బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాన్ని అందుకోలేకపోయింది.

**నేనప్పుడే చెప్పా..**

కానీ సత్యదేవ్ దమ్మున్న నటుడని మాత్రం పేరు సంపాదించుకున్నాడు. ప్రస్తుతం ఇతడు కింగ్‌డమ్ మూవీలో విజయ్ దేవరకొండ సోదరుడిగా నటిస్తున్నాడు. అలాగే సత్యదేవ్ చేతిలో ఫుల్ బాటిల్, గరుడ: చాప్టర్ 1 చిత్రాలున్నాయి. తాజాగా ఇతడు పరదా సినిమా సాంగ్ లాంచ్ ఈవెంట్‌కు హాజరయ్యాడు. ఈ క్రమంలో నిర్మాత విజయ్ డొంకాడ.. సత్యదేవ్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేశాడు. సత్యతో 47 డేస్ సినిమా చేశాను. భయ్యా.. నువ్వు త్వరలోనే కోటి రూపాయల ఆర్టిస్టువి అవుతావు అని ఆ సినిమా షూటింగ్‌లోనే అన్నాను.

**చాలా టాలెంట్**

ఆ రూ.1 కోటి మార్కు ఆయన ఎప్పుడో దాటేశారు. సత్య చాలా టాలెంటెడ్ ఆర్టిస్ట్. ఆయన నాకు ఫ్యామిలీ మెంబర్‌లానే అనిపిస్తాడు అని చెప్పుకొచ్చాడు. పరదా సినిమా విషయానికి వస్తే.. ఇందులో అనుపమ ప్రధాన పాత్రలో నటించింది. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహించగా విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. ఆగస్టు 22న పరదా విడుదల కానుంది.

Ediited Printed & Published Mekkonda Premraj  on behalf MPR publications and Printed  RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,